Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 180
పేజీలు - 8 వెల- రూ 5 : 00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
శనివారం 24, ఫిబ్రవరి-2024
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## లాస్యనందితకు సిఎం రేవంత్ నివాళి



3లో..

# మాది ప్రజాప్రభుత్వం.. ప్రజల సమస్యలే ఎజండాగా ముందుకు

- మేడారం జాతరపై కేంద్రం వివక్ష
- కుంభమేళా తరహాలో మహాజాతరను గౌరవించాలి
- అక్కడ ఇచ్చినట్లే ఇక్కడా నిధులు ఇవ్వాల్సిందే
- ఉత్తర,దక్షణ రాష్ట్రాల మధ్య వివక్ష సరికాదు
- మేడారంను ప్రధాని మోడీ, అమిత్ షాలు దర్శించాలి
- అమ్మవార్లను తృణీకరించడం వల్లనే కెసిఆర్ ఓడిపోయారు
- 27న కాంగ్రెస్ నేత ప్రియాంక చేతులమీదుగా రెండు గ్యారెంటీలు
- మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న సిఎం రేవంత్



ములుగు,ఫిబ్రవరి23 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీల్లో మరో రెండింటి అమలుకు ముహూర్తం ఖరారైంది. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీలను 27న సాయంత్రం ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకాల ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ హాజరవుతారని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం వెళ్లి సమ్మక్క- సారలమ్మలను రేవంత్ దర్శించుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వన దేవతలను కోరుకున్నట్లు వెల్లడించారు. మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వానికి ఎందుకింత వివక్ష అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రి సీతక్క కృషితో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పండుగగా మేడారం జాతరను ప్రకటించారని గుర్తుచేశారు. కుంభమేళాను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించినప్పుడు.. సమ్మక్క- సారలమ్మ జాతరను గుర్తిస్తే తప్పేంటీ అని నిలదీశారు. దక్షిణాది కుంభమేళాకు ప్రాముఖ్యం ఇచ్చినప్పుడు.. మేడారం జాతరను కేంద్రం ఎందుకు విస్మరిస్తుందని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతరకు రావాలని కోరారు. మేడారం జాతరలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సీఎంకు అతిథి మర్యాదలతో సత్కరించారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ... సమ్మక్కను దర్శనం చేసుకోకపోవడం వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూల్యం చెల్లించుకున్నారని.. బీజేపీకి కూడా అదేగతి పడుతుందని హెచ్చరించారు. ములుగు జిల్లాతో, మంత్రి సీతక్కతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ముఖ్యమైన కార్యక్రమాలన్నీ మేం ఇక్కడి నుంచే ప్రారంభించాం. 'హాథ్ సే హాత్ జోడో యాత్ర' ఇక్కడి నుంచే ప్రారంభించా. మేడారం జాతరలో భక్తులకు ఇబ్బందులు రాకుండా రూ.110 కోట్లు మంజూరు చేశాం అని చెప్పారు. మేడారం జాతరపై కేంద్రం వివక్ష చూపడం సరికాదని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. జాతీయ పండుగగా ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పినట్లుగా పత్రికల్లో చూశాను. కేంద్రం కుంభమేళాను జాతీయ పండుగగా నిర్వహిస్తోంది. వందల కోట్లు విడుదల చేసింది. దక్షిణాది కుంభమేళా మేడారం జాతరకు మాత్రం కేవలం రూ.3 కోట్లు కేటాయించింది. తెలంగాణ ను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందనేందుకు ఈ జాతర పట్ల వ్యవహరిస్తున్న తీరే నిదర్శనం. అయోధ్యలో రాముడిని దర్శించుకోవాలని ప్రధాని మోదీ, అమిత్ షా చెప్పారు. ఆ మాదిరిగానే మేడారం జాతరను వారిద్దరూ వచ్చి దర్శించుకోవాలి. వారిని అధికారిక హోదాలో స్వాగతం పలికే బాధ్యతను నేను, మంత్రివర్గం చూసుకుంటాం అన్నారు.

## ఢిల్లీ లిక్కర్ కేసు కీలక మలుపు

- కేసులో ఇదితురాలిగా ఎమ్మెల్సీ కవిత
- 26న విచారణకు రావాలని సిబిఐ నోటీసులు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 : ఢిల్లీ లిక్కర్ కేసు కీలక మలుపు తిరిగింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను నిందితురాలిగా సీబీఐ చేర్చింది. ఈ మేరకు కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 26న విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ సీఎం కేజీవ్రాల్‌తో పాటు కవితను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సీబీఐ వర్గాలు అంటున్నాయి. ఇదే కేసుల ఇప్పటికే కవితను మూడుసార్లు సీబీఐ ప్రశ్నించింది. 2022లో ఇదే కేసులో సీబీఐ ప్రశ్నించింది. లిక్కర్ కేసులో నిందితురాలిగా సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన నోటీసులను సవరిస్తూ తాజాగా మరోసారి సీబీఐ నోటీసులిచ్చింది. దర్యాప్తు తర్వాత కవితను నిందితురాలిగా సీబీఐ పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. న్యాయమూర్తి

## గొర్రెల పంపిణీలో గోల్‌మాల్


- పత్రాల మాయంలో తలసాని పిఏ హస్తం
- టీపీసీసీ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్



హైదరాబాద్,ఫిబ్రవరి23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల పంపకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని టీపీసీసీ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాగ్ నివేదికలో గత కేసీఆర్ ప్రభుత్వ అక్రమాలు పూర్తిగా బయటపడ్డాయని అన్నారు. గొర్రెలు పంపిణీ చేసిన వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోందన్నారు. రూ.142 కోట్ల విలువైన గొర్రెల వివరాలు లెక్కలు లేవని చెప్పారు. గొర్రెల పంపకాలపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు. డిసెంబర్ 10వ తేదీన మాసబ్ ట్యాంక్‌లోని ఎనిమల్ హజ్‌బెండరీ ఆఫీస్ నుంచి పత్రాలు దొంగతనం చేశారని తెలిపారు. ఇందులో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పీఏ హస్తం ఉన్నట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని అన్నారు. ఇప్పుడు కేవలం నలుగురు అధికారులను బాధ్యులను చేసి ప్రభుత్వం ఊరుకుంటే అసలు దోషులు బయటపడరని అన్నారు. తప్పు చేసిన అందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేపల పంపిణీలలో కూడా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. గొర్రెలు, చేపల పంపిణీలపై లెక్కలు తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌పై కూడా వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం విచారణ జరపాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

## మరో ఘోర రోడ్డు ప్రమాదం

- ఓఆర్ఆర్‌పై రెయిలింగ్‌ను ఢీకొన్న కారు
- యువ ఎమ్మెల్యే లాస్యనందిత మృత్యువాత
- వరుస ప్రమాదాలను తట్టుకున్నా వెన్నాడినమృత్యువు
- సిఎం రేవంత్, మాజీ సిఎంకెసిఆర్ తదితరుల తీవ్ర దిగ్భ్రాంతి





హైదరాబాద్,ఫిబ్రవరి23 : మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓయువ మహిళానేత ప్రమాదంలో దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలను ఎదుర్కొంటూ వచ్చిన ఆమెను మృత్యువు జయిస్తూ వచ్చారు. చివరకు మృత్యువే జయించింది. కారు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కన్నుమేశారు. ఎన్నో ఆశలతో తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆమెను మృత్యువు నిలనీయలేదు. నీవెంటే నేను అంటూ వెంటాడి చంపింది. చివరకు ఏడాదిలోపే తండ్రి దగ్గరకు లాస్య నందిత చేరుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె పీఏ ఆకాశ్, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎమ్మెల్యే భౌతిక కాయాన్ని పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. నల్గొండలో భారాస బహిరంగసభకు హాజరై తిరిగి వస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలోని చెర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది డిసెంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన లాస్య లిఫ్టులో ఇరుక్కుపోయిన సంగతి తెలిపిందే. ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ కిందకి పడిపోవడంతో అందులో చిక్కుకుపోయారు. ఇలా వరుస ప్రమాదాలు వెన్నాడినా బతికిబయటపడ్డారు. చివరకు జరిగిన ప్రమాదంలో ప్రాణాలు దక్కించుకోలేక పోయారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. గతేడాది ఫిబ్రవరి 19న సాయన్న మృతి చెందారు. ఏడాది కాలంలోనే తండ్రి, కూతురు మృతి చెందడం.. ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. 1987లో హైదరాబాద్‌లో జన్మించిన లాస్య నందిత.. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2016లో సాయన్నతోపాటు భారాసలో చేరారు. 2016-20 మధ్య కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2021 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ నుంచి ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. భాజపా అభ్యర్థిపై 17 వేల ఓట్ల

## మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

- గద్దెల వద్ద కేంద్రమంత్రి ముండాతో కలిసి పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పణ



ములుగు,ఫిబ్రవరి23 : మేడారం సమక్క – సారమ్మ మహా జాతర వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో భక్తులు మేడారంకు చేరుకుని మొక్కులు


## మల్లు రవి సంచలన నిర్ణయం

### ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధికి రాజీనామా



హైదరాబాద్,ఫిబ్రవరి23 : టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను సీఎం రేవంత్ రెడ్డికి మల్లురవి పంపించారు. తన రాజీనామాను ఆమోదిస్తారా లేక ఆమోదించకుండానే నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటిస్తారా అనేది సీఎం రేవంత్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉండనున్నది.

## ప్రజానాడి




## సిద్దిపేట, జనగామ కలెక్టర్ల బదిలీ

- పలువురు ఐఎఎస్‌లకు స్థానచలనం

హైదరాబాద్,ఫిబ్రవరి23 : తెలంగాణలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. తాజాగా ఐదుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బదిలీ అయ్యారు. ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. సిద్దిపేట కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి నియా మకం అయ్యారు. జనగామ కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ నియామకం అయ్యారు. జనగామ కలెక్టర్ శివలింగయ్యను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా

## ఎన్నికల ఏర్పాట్లలో ఇసి అధికారుల బిజీ

- పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న అధికారుల బృందం
- 13 వరకు కొనసాగనున్న అధికారుల పర్యటన
- ఆ తరవాతే ఎన్నికల నోటిఫికేషన్‌కు ఛాన్స్




న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 : లోక్ సభ ఎన్నికల ఏర్పాట్లలో కేంద్ర ఎన్నికల సంఘం బిజీగా ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు పర్యటిస్తున్నారు. ఆయా చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు పరిస్థితులను అంచనా వేస్తున్నారు. తగువిధంగగా సూచనలు చేస్తున్నారు. పలువురు అధికారులను బదిలీ చయిస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో అధికారులు పర్యటిస్తున్నారు. తర్వాత ఉత్తర ప్రదేశ్ , జమ్ము కశ్మీర్‌లో పర్యటిస్తారు. అన్ని రాష్ట్రాల్లో అధికారుల పర్యటన మార్చి 13వ తేదీ లోపు ముగియనుంది. 13వ తేదీ తర్వాత ఏ క్షణమైన లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రాల్లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు.

# సీటు బెల్టుల ధరించికపోవడం వల్లనే ప్రమాదం

● గతంలో అనేకులు ఇలాగే ప్రమాదానికి గురి

హైదరాబాద్,ఫిబ్రవరి23 : మితిమీరిన వేగం.. సీటు బెల్టు ధరించడంలో నిర్లక్ష్యం.. కారు ప్రమాద మరణాలకు ముఖ్య కారణం. పోలీసులు సీటు బెల్ట్ ధరించకుంటే ఫైన్ వేస్తామని హెచ్చరిస్తున్నా పాటించడం లేదు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదంలో మరిణించిన వారి జాబితాలో చాలామందే ఉన్నారు. కారు ఉన్న ప్రతి ఒక్కరికీ సీటు బెల్ట్‌పై పక్కాగా అవగాహన ఉంటుంది. అయినా సరే.. సమయం అలా వస్తుందో ఏమో కానీ సీటు బెల్ట్ మాత్రం ధరించడం లేదు. ప్రమాదంలో ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి మరణించినప్పుడల్లా సీటు బెల్ట్ ప్రాధాన్యం గురించి చర్చ జరుగుతూనే ఉంటోంది. తాజాగా ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో మరోసారి సీటు బెల్ట్ అంశం చర్చకు వస్తోంది. వాహనం దేన్నయినా ఢీ కొట్టినప్పుడు కారులోని వ్యక్తులు వేగంగా ముందుకు వెళ్తారు. ఆ సమయంలో వాళ్లు డ్యాష్ బోర్డునో.. వెనుక కూర్చున్నవారైతే ముందు సీట్ల మధ్య నుంచి వెళ్లి అద్దాన్ని వేగంగా గుద్దుకునే ఆస్కారముంటుంది. ఇక వాహనం ఏమైనా పల్టీ కొట్టిందా.. ఏకంగా అద్దంలో నుంచి ముందుకు పడిపోవడం జరుగుతుంటుంది. లేదంటే డోర్ ఊడిపోయి ఒక్కసారిగా ఎగిరి బయట పడిపోతారు. అలా జరిగితే తీవ్ర గాయాలై వ్యక్తి మరణించే అవకాశం ఉంటుంది. సీటు బెల్ట్ ధరించినప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టినా లేదంటే కారు పల్టీలు కొట్టినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ముందుగా అద్దంలో నుంచి ముందుకు పడటమో లేదంటే డోర్ ఊడిపోయి ఎగిరి బయట పడటమో జరగదు. ఈ తరుణంలో సీటు బెల్ట్ వారిని రక్షిస్తుంది. సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవుతాయి. దీంతో ప్రమాదం నుంచి సులభంగా గట్టెక్కవచ్చు. అత్యంత అరుదుగా మాత్రమే ఎయిర్ బ్యాగ్స్ సెన్సార్లు యాక్టివేట్ అయి, తెరుచుకోవడానికి 0.05 సెకన్ల సమయం పడుతుంది. ఇలా జరిగితే ఏమీ చెయ్యలేం. కానీ 99.95 శాతం మాత్రం సీటు బెల్ట్ పెట్టుకుంటే పక్కాగా బయటపడతాం. కొన్ని కార్లలో ముందు కూర్చున్న వారికి మాత్రమే సీటు బెల్ట్ ఉంటుంది. సాధారణంగా ఇప్పుడు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే కార్లలో అన్ని సీట్లకూ సీట్ బెల్ట్ ఉంటోంది. వాహనం ప్రమాదానికి గురైన వెంటనే కారులోని సెన్సర్లు యాక్టివేట్ అయిపోయి ఓ యాంగిల్‌ను ఏర్పరుచుకుంటాయి. ఇవి



ఎయిర్‌బ్యాగ్ కంట్రోల్ యూనిట్‌కు సమాచారం అంది స్తాయి. వెంటనే బెలూన్ యాక్టివేట్ అయిపోయి తెరుచుకుంటుంది. ఇదంతా కేవలం సెకన్లలోనే జరిగిపోతుంది. ఒకవేళ సీటు బెల్ట్ పెట్టుకోలేదంటే ఈ ప్రక్రియ జరగడానికి ఆస్కారమే ఉండదు. వెరసిఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావు.. ఫలితం మరణమే కావొచ్చు.

## మేడారంలో హిజ్రాల సందడి

### అమ్మవారికి స్వాగతం పలుకుతూ ముగ్గులు



ములుగు,ఫిబ్రవరి23 : మేడారం జాతర అంటేనే దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.. కోరిన కోర్కెలు తీర్చి కొంగు బంగారంగా నిలుస్తున్న వనదేవతల జాతరలో హిజ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.. సమ్మక్క సారలమ్మల జాతర మొదలవగానే హిజ్రాలు వారి కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సమ్మక్క తల్లి నీ ఆవాహన చేసుకుని కుటుంబ సభ్యులతో డప్పు చప్పుళ్ళ నడుమ మట్టితో అమ్మవార్ల గద్దెలను ఏర్పాటు చేసి బంగారం , మద్యం సమర్పించి కోళ్ళను,మేకలను బలి ఇస్తు అమ్మవార్లను పూజిస్తారనీ తెలిపారు. చిలకల గుట్ట నుండి సమ్మక్క రాక సందర్భంగా దారి వెంట రంగు రంగుల ముగ్గులు వేసి అమ్మవార్లకు స్వాగతం పలుకుతారు. సమ్మక్క తల్లి గద్దెలకు చేరుకున్న తర్వాత ఓడి బియ్యం,బంగారం (బెల్లం) , కొబ్బరి కాయలు సమర్పింస్తారని ,ఇలా మేడారం జాతరలో వనదేవతలకు పూజలు నిర్వహించడం వల్ల తాము కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు.

## ప్రమాదంలో లాస్యకు తీవ్ర గాయాలు

### పోస్ట్ మార్టమ్ రిపోర్టులో వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. నందిత మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అయితే ఆమె తలకు తీవ్ర గాయమైనట్లు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. ఎడమ కాలు ఎముక, దవడ ఎముకతో పాటు ఛాతీ ఎము కలు పూర్తిగా విరిగిపోయాయి. ఆరు దంతాలు కూడా ఊడిపోయాయని వైద్యులు తెలిపారు. సీటు బెల్ట్ ధరించి ఉంటే గాయాలు తక్కువగా అయ్యేవి అని వైద్యులు పేర్కొన్నారు. శవపరీక్ష పూర్తి చేసిన వైద్యులు.. ఆమె భౌతికఖాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మరికాసేపట్లో కార్ఖానాలోని నివాసానికి లాస్య నందిత పార్థివదేహాన్ని తరలించనున్నారు. సాయంత్రం మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. లాస్య నందిత పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పాతగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వస్తివాచనంతో ప్రారంభమైన వార్షిక బ్రహ్మో త్సవాలు.. ఐదో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ గరుడ వాహన అలంకార సేవల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చాడు. కాగా, ఈ కార్యక్రమం ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగనుంది. అలాగే బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 21 తేదీన ఎదుర్కోలు, 22వ తేదీన తిరుకల్యాణం, 23 తేదీన దివ్య విమాన రథోత్సవం జరగనున్నాయి. ఫిబ్రవరి 25 తేదీన అష్టోత్తర శత ఘటాభిషేకంతో ముగియనున్నాయి.

## మేడారంలో భక్తుల కిటకిట

### క్యూలన్లో తొక్కిసలాటలో ఇద్దరికి గాయాలు



ములుగు,ఫిబ్రవరి23 : మేడారం మహాజాతరకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చి తనివితీరా మొక్కులు చెల్లించుకొని తన్మయత్వం పొందుతున్నారు. కాగా, భక్తులు పోటెత్తడంతో మేడారం క్యూలైన్లలో తొక్కిసలాట నెలకొంది. సమ్మక్క భక్తులు- హిజ్రాలు ఘర్షణకు దిగారు. పరస్పరం దాడి చేసుకోవడంతో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి ఇద్దరి పరిస్థితి విష మంగా ఉంది. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మేడారంలో మీడియా సెంటర్ ఏర్పాటు

ములుగు,ఫిబ్రవరి23 : తెలంగాణ కుంభమేళా మేడారం మహా జాతర ను కవర్ చేసే ప్రింట్ , ఎలెక్ట్రానిక్ మీడియా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. మేడారం మహా జాతర విశేషాలను ఎప్పటికప్పుడు బయట ప్రపంచానికి తెలియజేసేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర విశిష్టతను, ఆదివాసి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రస్ఫుటించే విధంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో పాటు ప్రజలకు మధ్య అనుసంధానంగా సేవలు అందించడం జరుగుతుంది. మహా జాతర విశేషాలను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ను ఐ.టీ.డీ.ఏ గెస్ట్ హౌస్ ఎదురుగా ఏర్పాటు చేసింది. మీడియా సెంటర్లో వీడియో ఫుటేజ్ ఫోటోలు పంపేందుకు 100 ఎంబిపిఎస్ వేగంతో ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించడం జరిగింది. ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, జాతర ప్రాశస్త్యాన్ని తెలియజేసే విధంగా ఫోటో ప్రదర్శన వివిధ కళా బృందాలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జాతర కవర్ చేసే జర్నలిస్టులకు అవసరమైన భోజన వసతి కంప్యూటర్లు హై స్పీడ్ ఇంటర్నెట్, వై÷ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది.

## లాస్యనందిత మృతిపై విచారణ జరపాలి: బండి



హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. లాస్య మరణంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను తొలగించాలని పోలీసులను కోరారు. యువ మహిళా ఎమ్మెల్యే ప్రమాదానికి గురి కావడం బాధాకరమని కుటుంబ సభ్యుల ఆందోళనను పరిగణలోకి తీసుకురావాలని సూచించారు. నిక్కచ్చిగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు బండి సంజయ్. డ్రైవర్ ఆకాష్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అడిషనల్ ఎస్పీ సంజీవ రావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి కుట్రలు, అనుమానాలు లేవని వెల్లడించారు. ఎమ్మెల్యే లాస్య మరణం రోడ్డు ప్రమాదం వల్లనే జరిగిందని.. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని వెల్లడించారు.

## లాస్యనందిత మృతికి మంత్రుల సంతాపం

● ఆమె మృతి తీరని లోటన్న పలువురు నేతలు



హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ భారాస ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెదేపా అధినత చంద్రబాబునాయుడు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. పటాన్‌చెరు ఆస్పత్రికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు.తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య నందిత మృతి చెందడం దురదృష్టకరం. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచింది. లాస్య నందిత కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఆమె శ్రేయోభిలాషులు, స్నేహితుల నుంచి వస్తున్న ప్రేమ, మద్దతు ఆ కుటుంబానికి బలాన్ని చేకూర్చాలని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. వారం క్రితమే లాస్యను కలిసి మాట్లాడాం. ఇంతలోనే ఇలాంటి షాకింగ్, దిగ్భ్రాంతికర వార్త వినాల్సి వచ్చింది. ఇలాంటి కష్ట సమయాల్లో లాస్య కుటుంబ సభ్యులకు, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతి అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య మృతి ఎంతో బాధ కలిగించింది. ఆమె కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. చిన్న వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై.. తన తండ్రి, దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందిన నందిత అకాల మృతి తీవ్ర బాధాకరం. ఏడాది క్రితం సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు మృతి చెందడం విచారకరమని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. లాస్య.. గొప్ప భవిష్యత్ ఉన్న యువ నాయకురాలు. ప్రజల మద్దతుతో ఎన్నికై ఇలా అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతినిమాజీ మంత్రి తలసాని ప్రకటించారు. లాస్య ఇంటికి వెళ్లి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లాస్య నందిత మరణం కంటోన్మెంట్ ప్రజలకు, భారాస పార్టీకి తీరని లోటమాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. యువనేత అకాల మరణం బిఆర్ఎస్‌కు తీరన ఇనష్టమని అన్నారు.

## మహాజాతరలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు




● సురక్షిత త్రాగునీరు టాయిలెట్ లో సౌకర్యం
● 354స్నాన ఘట్టాలు, మహిళా దుస్తుల మార్పిడి కంపార్ట్‌మెంట్లు

ములుగు,ఫిబ్రవరి23 : మేడారం జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగులో పుణ్యా స్నానాలు ఆచరించేందుకు గాను స్నాన ఘట్టాలతో పాటు షవర్ బాతులను ప్రభుత్వం నిర్మించింది. 6 కోట్ల 11 లక్షల రూపాయలు వ్యయంతో స్నాన ఘట్టాల మరమ్మత్తులు చేయడంతో పాటు నూతనంగా 354 స్నాన ఘట్టాలు నిర్మించడం, 132 మహిళల దుస్తుల మార్పిడి కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయడం జరిగింది. జంపన వాగులో భక్తుల రక్షణార్థం 250 గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు నిరంతర త్రాగునీటి సరఫరా టాయిలెట్ల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం 13 కోట్ల యాభై లక్షలు రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగింది. త్రాగునీటి కోసం 6 కోట్ల రూపాయలతో 17 ఇన్ ఫిల్టరేషన్ బావుల నిర్మాణం, 495 ప్రాంతాలను గుర్తించి నిరంతరాయంగా త్రాగునీరు అందించేందుకు 5 వేల ట్యాపులను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్ అంతరాయం కలగకుండా 40 జనరేటర్లను ఏర్పాటు చేశారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా 8400 టాయిలెట్లను 500 ప్రాంతాల్లో చేపట్టడం ద్వారా జాతరకు విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీటి కోసం 6కోట్ల రూపాయలతో17ఇన్ ఫిల్టరేషన్ బావుల నిర్మాణం, 495ప్రాంతాలను గుర్తించి నిరంతరాయంగా త్రాగునీరు అందించేందుకు 5వేల ట్యాపులను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్ అంతరాయం కలగకుండా40జనరేటర్ లను ఏర్పాటు చేశారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా 8400టాయిలెట్లను 500ప్రాంతాల్లో చేపట్టడం ద్వారా జాతరకు విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## లాస్యనందిత మృతితో బిఆర్ఎస్ షాక్

● ఇంటికి వెళ్లి పార్థివదేహానికి కెసిఆర్ నివాళి
● పలువురు నేతలు ఇంటికి వెళ్లి కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో బిఆర్ఎస్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఓ యువ ఎమ్మెల్యే మృతితో నేతలంతా షాక్‌కు గురయ్యారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత భౌతిక కాయానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులు అర్పించారు. కార్ఖానాలోని లాస్య నందిత నివాసానికి చేరుకున్న ఆయన ఆమె భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం లాస్య నందిత మాతృమూర్తి, మాజీ ఎమ్మెల్యే సాయన్న సతీమణిని, ఇతర కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. అంతకుముందు లాస్య నందిత మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు. అతిపిన్న వయస్సులో ఎమ్మెల్యేగా నందిత ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కష్టకాలంలో వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లాస్యనందిత పార్థివదేహాని బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. కార్ఖానాలో నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కేకే, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్ రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దారం నాగేందర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ విజయా రెడ్డితోపాటు పలువురు నాయకులు ఆమె



భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరూ సమీపంలో ఓఆర్ఆర్‌పై అదుపుతప్పి రెయిలింగ్‌కు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. సాయంత్రం మారేడుపల్లిలోని శ్మశానవాటికలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

## మల్లు రవి సంచలన నిర్ణయం

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన బూస్టప్‌తో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. దీనిలో భాగంగానే జిల్లాలో బాగా పట్టున్న అభ్యర్థిని నాగర్ కర్నూల్ జిల్లా నుంచి బరిలో నిలపాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే మల్లు రవి రాజీనామా చేసినట్లు ఊహగానాలు వినిపిస్తున్నాయి. అయితే వారం క్రితమే రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్‌కు



వంశీచంద్ పేరును ప్రకటించగా, నాగర్ కర్నూలుకు మల్లు రవి పేరు దాదాపు ఖరారు అయినట్లేనని భావిస్తున్నారు.

## ఎమ్మెల్యే కారు ప్రమాదంపై అనుమానాలు

### లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్,ఫిబ్రవరి23 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదం దుర్మరణం పాలైన ఘటన తెలంగాణలో సంచలనం రేపుతోంది. తెల్లవారుజామునే కావడంతో ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న పూర్తి విషయాలైతే తెలియడం లేదు. కారును పూర్తిగా పరిశీలించి పోలీసులు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ కేసులో ట్విస్ట్ ఒకటి వెలుగు చూసింది. ఇప్పటి వరకూ కారు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఇంత ఘోర ప్రమాదం జరిగిందని అంతా భావిస్తున్నారు. కానీ తాజాగా కారును పరిశీలించిన పోలీసులు కేవలం రెయిలింగ్‌ను ఢీకొనడం వల్లే ఇంత ఘోర ప్రమాదం జరగలేదన్న అంచనా కు వచ్చారు. రెయిలింగ్‌తో పాటు ముందున్న లారీని సైతం లాస్య నందిత కారు ఢీ కొట్టినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతివేగంగా వచ్చిన కారు ముందున్న వాహనాన్ని ఢీకొట్టినట్లు ఆనవాళ్లు కనిపించాయి. కారు బ్యానెట్ పైభాగం పూర్తిగా ధ్వంసమైంది. కారుకు ఎడమవైపు ఉన్న ముందు చక్రం సైతం పూర్తిగా ధ్వంసమైంది. మీటర్ బోర్డ్ 100 కిలోమీటర్ల స్పీడ్ వద్ద స్టక్ అయినట్లు పోలీసులు గుర్తించారు. నందిత కారు బ్యానెట్ పై భాగంలో అంటుకొని ఉన్న ఇసుక క్లూస్‌ను పోలీసులు సేకరించారు. ఔటర్ రింగ్ రోడ్డు రెయిలింగ్‌ను ఢీ కొడితే ఈ స్థాయిలో ప్రమాదం జరగకపోవచ్చని నిపుణులు అంటున్నారు.

## ప్రభుత్వ లాంఛనాలతో లాస్య అంత్యక్రియలు

### మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి తెలిపారు. కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లాస్య నందిత మృతి బాధాకరమని మంత్రి చెప్పారు. ప్రమాద సమయంలో ఆమె సీట్ బెల్ట్ పెట్టుకోలేదని పోలీసులు చెప్పారని వెల్లడించారు. లాస్య నందిత మృతదేహానికి గాంధీ దవాఖానలో పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం కార్ఖానాలోని నివాసానికి ఆమె పార్థివదేహాన్ని తరలించారు. ఈస్ట్ మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. లాస్య నివాసానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు.

## లాస్యనందిత మృతి తీరని లోటు

### కుటుంబ సభ్యులకు కెటిఆర్ సంతాపం

హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లాస్య ఇక లేరనే అత్యంత విషాదకరమైన, షాకింగ్ న్యూస్ తెలుసుకున్నానని చెప్పారు. దాదాపు వారం క్రితమే ఆమెను పరామర్శించానని, అంతలోనే మళ్లీ ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని అన్నారు. చాలా మంచి నాయకురాలిగా ఉన్న యువ శాసనభ్యురాలిని కోల్పోవడం బీఆర్ఎస్ పార్టీకి తీరని నష్టమని చెప్పారు. ఈ విషాద సమయంలో ఆమె కుటుంబం, స్నేహితులకు బలం చేకూర్చాలని ప్రార్థించారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులతో ఉన్న ఫోటోలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఢిల్లీ లిక్కర్ కేసు కీలక మలుపు

(మొదటిపేజీ తరువాయి)

ముందు కవిత పీఏ అశోక్ కౌశిక్ సంచలన విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. లిక్కర్ కేసులో పలువురికి ముడుపులు అందజేసినట్లు జడ్జి ముందు కౌశిక్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. కవితతో పాటు కౌశిక్‌ని కూడా నిందితుడిగా సీబీఐ పరిగణిస్తోంది. సీబీఐ గతంలో ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పలుమార్లు కవితను ప్రశ్నించింది. చివరగా గత ఏడా ది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు జారీచేసింది. అయితే ఈడీ విచారణకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున విచారణకు హాజరుకాలేనంటూ ఆమె లేఖ రాశారు. ఆ తర్వాత ఈడీ నుంచి కవితకు ఏ విధమైన సమాధానం రాలేదు. సుప్రీంలో పిటిషన్‌పై ఈ నెల 28న విచారణ జరగనుంది.

## అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ , కేంద్ర మంత్రి అర్జున్ ముండా మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, కేంద్రమంత్రి నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమిళిసై, అర్జున్ ముండా వనదేవతలను దర్శించుకున్నారు. దర్శనానంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరానని తెలిపారు. ఇది గొప్ప జాతర అని కొనియాడారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని తెలిపారు. 'నేను గవర్నర్‌గా మూడోసారి మేడారం జాతరకు రావడం నా అదృష్టం' అని గవర్నర్ తమిళిసై హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు. కాగా.. సమ్మక్క-సారలమ్మల నామస్మరణతో మేడారం మహా జాతర ప్రాంగణం మార్మోగుతోంది. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటికే గద్దెలపైకి సమక్క సారలమ్మలు చేరుకోవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 21 నుంచి జాతర ప్రారంభమవగా.. నాలుగు రోజుల పాటు వనదేవతల జాతర జరుగనుంది. తిరిగి అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

## ఎన్నికల ఏర్పాట్లలో ఇసి అధికారుల బిజీ

(మొదటిపేజీ తరువాయి)

ఈవీఎంల తరలింపు, భద్రతా దళాల మొహరింపు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవాలని కేంద్ర అధికారులు భావిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏఐ సేవలను వినియోగిస్తారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దృష్టిసారించారు. ఆ సమాచారం తొలగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ఉంటే ఆ కంటెంట్ వెంటనే తొలగిస్తారని పేర్కొన్నారు. పార్టీ లేదంటే అభ్యర్థి నిబంధలను ఉల్లంఘిస్తే వారి అకౌంట్లను సస్పెండ్ చేయాలని, లేదంటే ఖాతా బ్లాక్ చేయాలని సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫామ్‌లను కోరతామని తేల్చిచెప్పారు. తప్పుడు సమాచారంపై ప్రత్యేక దృష్టిసారిస్తారు. సున్నిత ప్రాంతాల్లో ఆ సమాచారం ప్రభావం ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఆ వార్త నిజమో, అబద్ధమో ఫ్యాక్ట్ చెక్ చేసి ప్రజలకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

## సిద్దిపేట, జనగామ కలెక్టర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

శైలజ రామయ్యర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మరోసారి పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటి ల్‌ను నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేశారు. సిద్ధిపేట నూతన కలెక్టర్ గా కామా రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరినినియమించించారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను జనగాం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశిం చారు. ప్రస్తుత పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శైల జా రామయ్యర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను అదనంగా అప్పగించింది. ఇంతకాలం ఆ బాధ్యతలు అదనపు హోదాలో చూస్తున్న సునీల్ శర్మను అక్కడి నుంచి రిలీవ్ చేసింది రాష్ట్ర సర్కార్.

## కేసీఆర్ పాపాల ఫలితంగానే బీఆర్ఎస్ ఓటమి

### బిఆర్ఎస్ ఒక్కసీటు గెల్చినా లాభం లేదు

### విజయసంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి



మంచిర్యాల,ఫిబ్రవరి23 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ పాలన ఖతమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపేర్కొన్నారు. కెసిఆర్ అవినీతే ఆయనను బొందపెట్టిందన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర లో కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాపాల ఫలితంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. ఫామ్ హౌస్‌కు వెళ్లి కాలు విరగొట్టుకున్నాడన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే వృథా అవుతుందన్నారు. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటు గెలిచినా.. తెలంగాణకు లాభం లేదని.. గెలవకున్నా రాష్ట్రానికి నష్టం ఉండదన్నారు. మోసపూరిత కాంగ్రెస్ ను కూడా నమ్మొద్దని.. అవినీతి కి చిరునామా ఆ పార్టీ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు సంబంధించినవని.. మోదీతోనే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేది లేదన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కాంగ్రెస్ నాయకులే వద్దంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఏలి రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాజేసిందని ఆరోపించారు. దేశంలో సకల సమస్యలకు కాంగ్రెస్ (అనీనిణస।బబ) కారణమన్నారు. ఆర్టికల్ 370 ని రద్దుతో కశ్మీర్‌లో జాతీయ జెండా రెపరెపలాడుతోందన్నారు. 500 ఏళ్ల క్రితం నాటి అయోధ్య సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి యుతంగా పరిష్కరించి, రామ మందిరాన్ని నిర్మించిందని తెలిపారు. 370 పార్లమెంటు స్థానాలు బీజేపీకి రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అందులో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కూడా ఉండాలన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలందరూ నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ జన్మలో ప్రధాన మంత్రి కాలేదని విమర్శించారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ని గెలిపిస్తేనే హామీలు అమలు చేస్తామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ్ సంకల్ప్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు నిధులనెలా సమకూర్చుకుంటారో బయట పెట్టాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఎన్నిక అవుతారని కిషన్ రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400లకు పైగా సీట్లను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు సైతం మోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు.

## నేడు జనసేన-టిడిపి తొలి జాబితా విడుదల ?

అమరావతి,ఫిబ్రవరి23 : టీడీపీ-జనసేన ఉమ్మడి జాబితా శనివారం విడుదలయ్యే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది . సుమారుగా 60 నుంచి 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. వివాదాలు లేని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే ఆలోచనలో ఇరు పార్టీలుఉన్నట్లు సమాచారం. ముఖ్యనేతలు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఇరు పార్టీల సమాచారం అందించారు. ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు ముఖ్య నేతలతో కలిసి జాబితాపై కసరత్తు చేస్తున్నారు. అటు మంగళగిరిలోని పార్టీ ఆఫీసులో కూడా పవన్ కల్యాణ్ జాబితాపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో జనసేనాని పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ పోటీచేసే స్థానాలు ఉండనున్నాయి.

# లాస్యనందితది ముమ్మాటికీ ప్రమాదమే

- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
- డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసుల వెల్లడి
- సోషల్ మీడియా వార్తలను నమ్మొద్దని సూచన




సంగారెడ్డి,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు డ్రైవర్ ఆకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు సంగారెడ్డి జిల్లా పోలీసులు తెలిపారు. కారు ప్రమాదం ఘటనపై లాస్య నందిత సోదరి నివేదిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డ్రైవర్ ఆకాశ్‌పై 304ఏ సెక్షన్ కింద పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడిపాడని లాస్య సోదరి నివేదిత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతి వేగంగా కారు నడిపి లాస్య మృతికి కారణమయ్యాడని ఆమె అన్నారు. ఈ ప్రమాద ఘటనపై సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో లాస్య నందితతో పాటు ఆమె డ్రైవర్ ఆకాశ్(24) ఉన్నాడు. సదాశివపేటలోని దర్గాకు వెళ్లేందుకు ఎమ్మెల్యే లాస్య నందిత తన ఇంటి నుంచి శుక్రవారం తెల్లవారుజామున బయల్దేరారు. తెల్లవారుజామున 4:58 గంటల సమయంలో శామీర్‌పేట టోల్ ప్లాజా వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశించారు. సుల్తాన్ పూర్ ఎగ్జిట్ సమీపంలో ఉదయం 5:30 గంటల సమయంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఎమ్మెల్యే కారు ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో లాస్య నందిత బతికే ఉన్నారు. ఆస్పత్రికి తరలిస్తుండగాప్రాణాలుకోల్పోయారు. పీఏఆకాశ్ ఎడమకాలు విరిగిపోయింది. అతను శ్రీకర ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారని ఏఎస్పీ సంజీవ రావు తెలిపారు. ఇది రోడ్డు ప్రమాదమే అని పోలీసులు తేల్చారు. ఎమ్మెల్యే లాస్య కారు ప్రమాదం.. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే జరిగిందని.. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు తెల్లవారుజామున ఎమ్మెల్యే లాస్య ఇంటి నుంచి బయలుదేరినట్లు వివరించారాయన. ఆ తర్వాత 4 గంటల 58 నిమిషాలకు ఎమ్మెల్యే లాస్య కారు.. శామీర్ పేట టోల్ ప్లాజా క్రాస్ చేసినట్లు రికార్డ్ ఉందని.. అక్కడే ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి సుల్తాన్ పూర్ ఎగ్జిట్ సమీపంలో.. ఉదయం 5 గంటల 38 నిమిషాలకు ముందు వెళ్తున్న వాహనాన్ని ఎమ్మెల్యే లాస్య కారు ఢీకొన్నదని.. ఆ వెంటనే పక్కనే ఉన్న రైలింగ్ ను వేగంగా ఢీకొట్టినట్లు స్పష్టం చేశారు. ప్రమాదంలో డ్రైవర్ ఆకాష్ నిర్ల క్ష్యం, అతి వేగం వల్లే ఈ యాక్సిడెంట్ జరిగిందని.. ఈ ప్రమా దంలో ఎలాంటి కుట్రలు, అనుమానాలు లేవని వెల్లడించారు అడిషినల్ ఎస్పీ సంజీవరావు. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మె ల్యేను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారని.. అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు తెలిపినట్లు వివరించారు. సోషల్ మీడి యాలో వస్తున్న కొన్ని పోస్టులను ఎవరూ నమ్మొద్దని స్పష్టం చేశారు.

# లాస్యనందితకు సిఎం రేవంత్ నివాళి

### భైతికకాయం వద్ద పుష్పాంజలి

### కుటుంబ సభ్యులకు ఓదార్పు

### అధికార లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు



హైదరాబాద్,ఫిబ్రవరి23 : ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత భౌతిక కాయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. లాస్య నందిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీఎంతో పాటుగా మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లాస్య నందిత భౌతికకాయానికి నివాళులర్పించారు. యువ ఎమ్మెల్యే ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని అన్నారు. ఏడాదిలోపే సాయన్న, ఆమె కుమార్తె మరణించడం జీర్ణించుకోలేని విషయమని అన్నారు. శుక్రవారం తెల్లవారు జామున కారు ప్రమాదంలో లాస్య నందిత మృతి చెందిన విషయం తెలిసిందే. తలకు బలమైన గాయం, ఇంటర్నల్ బ్లీడింగ్ వల్లే లాస్య నందిత చనిపోయినట్టు పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపారు. తరవాత లాస్యనందిత అంతిమయాత్ర ప్రారంభం కాగా బీఆర్ఎస్ నాయ కులు భారీగా చేరుకున్నారు. మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేతకేసీఆర్.. లాస్య నందిత పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఇంటి నుంచి మారేడ్ పల్లి శ్మశాస వాటిక వరకు అంతిమయాత్ర సాగింది. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొని.. లాస్యకు తుది వీడ్కోలు పలికారు. ఇంటి నుంచి బయలుదేరిన అంతిమయాత్రలో.. మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు.. లాస్య పాడె మోశారు. అభిమానులు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. లాస్య అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే లాస్య మరణం వార్త తెలిసినప్పటి నుంచి హరీశ్ రావుతోపాటు ఇతర నేతలు అన్నీ దగ్గరుండి చేశారు. పటాన్ చెరు ఆస్పత్రి నుంచి ఉస్మానియాకు రావటం.. పోస్టుమార్టం.. ఆ తర్వాత ఇంటికి తీసుకురావటం.. అంతిమ యాత్ర, అంత్యక్రియలు వరకు దగ్గరుండి పర్యవేక్షించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

## ముందువెళుతున్న వాహనాన్ని ఢీకొన్న ఎమ్మెల్యే కారు



### ప్రమాద సమయంలో గాయపడ్డ లాస్యనందిత

### ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి: పోలీసులు

సంగారెడ్డి,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై లాస్య నందిత కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాద ఘటనపై సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో లాస్య నందితతో పాటు ఆమె పీఏ ఆకాశ్(24) ఉన్నాడు. సదాశివపేటలోని దర్గాకు వెళ్లేందుకు ఎమ్మెల్యే లాస్య నందిత తన ఇంటి నుంచి శుక్రవారం తెల్లవారు జామున బయల్దేరారు. తెల్లవారుజామున 4:58 గంటల సమయంలో శామీర్‌పేట టోల్ ప్లాజా వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశించారు. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ సమీపంలో ఉదయం 5:30 గంటల సమయంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఎమ్మెల్యే కారు ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో లాస్య నందిత బతికే ఉన్నారు. ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. పీఏ ఆకాశ్ ఎడమకాలు విరిగిపోయింది. అతను శ్రీకర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఏఎస్పీ సంజీవ రావు తెలిపారు. ఇది రోడ్డు ప్రమాదమే అని పోలీసులు తేల్చారు.

# మరో ఘోర రోడ్డు ప్రమాదం





(మొదటిపేజీ తరువాయి)

మెజార్టీతో విజయం సాధించారు. అంతలోనే ఆమె మృత్యు ఒడిని చేరడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనతో బిఆర్ఎస్ సమా అధికార, విపక్ష బిజెపి నేతలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. లాస్యనందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నందిత తండ్రి సాయన్నతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. లాస్య నందిత మృతిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అతి పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొందారని.. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్ వద్ద కారు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే, ఆమెను ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు వెంటాడాయి. 2 ప్రమాదాల్లో ఆమె బయటపడినా.. మూడోసారి ప్రమాదంలో మృత్యువు కబళించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం 2023, డిసెంబర్ 24న బోయిన్పల్లి వద్ద ఆమె లిఫ్ట్ లో చిక్కుకున్నారు. అక్కడ వీఆర్ ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం లిఫ్ట్ లో కిందకు దిగుతుండగా అందులో చిక్కుకున్నారు. చాలామంది లిఫ్ట్ లోకి వెళ్లడంతో కొద్దిసేపటికి డోర్ తెరుచుకోలేదు. దీంతో లాస్య నందితతో పాటు పలువురు దాదాపు 3 గంటలు అందులోనే చిక్కుకుని ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ డోర్ బద్దలుకొట్టి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 13న నల్గొండలో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో లాస్య నందిత పాల్గొన్నారు. సభ అనంతరం తిరిగి హైదరాబాద్ వస్తుండగా నార్కట్పల్లి సమీపంలోని చర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. అదే వేగంతో వెళ్లి ట్రాఫిక్ నియంత్రిస్తున్న హోంగార్డులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో హోంగార్డుకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో లాస్య నందితతో పాటు ఆమె సోదరి, ఇద్దరు గన్ మెన్లు ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న లాస్య నందిత తన సోదరితో కలిసి మరో కారులో హైదరాబాద్ చేరుకున్నారు. నల్గొండ ప్రమాదం జరిగిన 10 రోజుల తర్వాత శుక్రవారం లాస్య నందితను మరో కారు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. గత ప్రమాదం తర్వాత ఆమె కొత్త కారు కొన్నట్లు సమాచారం. గురువారం సదాశివపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన లాస్య నందిత తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున పటాన్ చెరు ఓఆర్ఆర్ సమీపంలో రెయిలింగ్ ను ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఆమె పీఏ, డ్రైవర్ అయిన ఆకాశ్ తీవ్రంగా గాయపడగా.. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిద్రమత్తు, అతి వేగమే కారు ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. 1987లో హైదరాబాద్ లో ఆమె జన్మించారు. కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ పూర్తి చేశారు. గతేడాది, ఫిబ్రవరి 19న లాస్య నందిత తండ్రి సాయన్న మృతి చెందారు. అనంతరం ఈ టికెట్ కోసం స్థానిక నేతలు కొందరు గట్టిగా ప్రయత్నించినా.. మాజీ సీఎం కేసీఆర్ సాయన్న కుమార్తె నందితపైనే నమ్మకం ఉంచారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ తరపున కంటోన్మెంట్ నుంచి పోటీ చేసి.. బిజెపి అభ్యర్థిపై 17,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తె మృతితో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలో విషాదం నెలకొంది.

## పెళ్ళి కోసం టివి యాంకర్ కిడ్నాప్

- యువతని అరెస్ట్ చేసిన పోలీసులు



హైదరాబాద్,ఫిబ్రవరి23 : ఓ టీవీ ఛానల్ మేల్ యాంకర్‌ను కిడ్నాప్ చేసిన యువతిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని పెళ్లి చేసుకోవాలన్న ఆశతో కిడ్నాప్‌నకు పాల్పడినట్లు గుర్తించారు. ఫిబ్రవరి 10వ తేదీ అర్ధరాత్రి ఐదుగురు వ్యక్తులు ప్రణవ్‌ను కిడ్నాప్ చేసి ఓ గదిలో బంధించారు. తనను పెళ్లి చేసుకోవాలంటూ సదరు యువతి యాంకర్‌ను ఒత్తిడి చేసింది. 11వ తేదీ ఉదయం నిందితురాలి బారి నుంచి తప్పించుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు యువతే కిడ్నాప్ చేయించినట్టు గుర్తించారు. డిజిటల్ మార్కెటింగ్ బిజినెస్ చేస్తున్న ఆమె ఓ మ్యాట్రిమోనీ సైట్‌లో ప్రణవ్ ఫొటోలు చూసి ఇష్టపడింది. ఎలాగైనా అతన్నే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని కిడ్నాప్ చేసి డిమాండ్ చేసింది. ఉప్పల్ పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మ్యాట్రిమోనీ సైట్‌లో ప్రణవ్ ఫొటోతో చైతన్యరెడ్డి అనే యువకుడు ఆమెతో చాటింగ్ చేసినట్టు పోలీసులు గుర్తించారు.

## కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబానికి కోటి పరిహారం

- యువకుడి చెల్లెలుకు ప్రభుత్వ ఉద్యోగం
- పంజాబ్ సిఎం భగవంత్ సింగ్ మాన్ ప్రకటన

చండీఘడ్,ఫిబ్రవరి23 : పోలీస్ కాల్పుల్లో మరణించిన యువరైతు కుటుంబానికి కోటి రూపాయల పరిహారాన్ని అందిస్తామని పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ కీలక ప్రకటన చేశారు. కన్నౌరి బోర్డర్ వద్ద జరిగిన కాల్పుల్లో మృతిచెందిన రైతు శుభ్‌కరణ్ సింగ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, అతని సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. బటిండాకు చెందిన శుభ్‌కరణ్ సింగ్ (21) అనే యువ రైతు బుధవారం పంజాబ్-హర్యానా సరిహద్దులోని ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద పోలీసులతో జరిగిన ఘర్షణల్లో మరణించాడు. శుభ్‌కరణ్ మృతికి కారణమైన పోలీసుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు పంజాబ్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. శుభకరన్ సింగ్ రబ్బరు బు÷-లలెట్ తగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పాటియాలా రేంజ్ డిఐజీ తెలిపారు. ఖనౌరీ, శంభు సరిహద్దు క్రాసింగ్ వద్ద హర్యానా పోలీసులు రైతుల మార్చ్ అడ్డుకునేందుకు భాష్ప వాయువు షెల్స్ ప్రయోగించడంతో మొత్తం 26 మంది రైతులు గాయాపడ్డారని పంజాబ్ అధికారులు తెలిపారు. యువ రైతు మరణించడంతో రైతులు ఢిల్లీ ఛలో మార్చ్‌ను రెండు రోజుల పాటువాయిదా వేశారు. తదుపరి కార్యచరణపై చర్చించేందుకు రైతులు సమావేశం కానున్నారు. పంటలకు ఎంఎస్పీకి చట్టబద్ధత, రైతులపై కేసుల ఎత్తివేత, ఇతర డిమాండ్లతో రైతులు చేపట్టిన ఢిల్లీ చలో మార్చ్ కు ఎస్ కేఎమ్, కిసాన్ మజ్దూర్ సంఘ్ నాయకత్వం వహిస్తున్నాయి.

# ఆర్థిక గడ్డు పరిస్థితులకు తోడు నిరుద్యోగం

దేశంలో ఆర్థిక గడ్డు పరిస్థితులను గట్టెక్కించే ప్రయత్నాలు సాగడం లేదు. రూపాయి విలువ క్రమంగా పడిపోతోంది. బంగారం, వెండి ధరలు సామాన్యులకు దూరంగా ఉన్నాయి. గృహనిర్మాణరంగం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్న ధోరణి కొనసాగుతోంది. హైదరాబాద్ లాంటి నగరంలో మధ్యతరగతి వారు కనీసం ఓ ఫ్లాట్ కూడా కొనలేని దుస్థితి ఉంది. పెరుగుతున్న సిమెంట్, ఐరన్, ఇతర సామాగ్రధరలకు తోడు బిల్డర్ల దోపిడీ కారణంగా ప్రజలకు గృహం అన్నది కలలా తయారయ్యింది. ఈ పరిస్థితులను అధ్యయనం చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారు. బియ్యం ధరలు నానాటికి పెరుగుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా బియ్యం ధరలు అదుపులోకి రావడం లేదు. గ్యాస్, ఇళ్లు ఇచ్చాం.. బాత్‌రూమ్‌లు కట్టించాం.. వికసిత భారత్ అంటూ ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. క్షేత్రస్థాయిలో బిజెపి నేతలు మోడీ జపం చేయడం తప్ప సమస్యలను అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక ఇవ్వడం లేదు. ఇకపోతే ఉద్యోగాల కల్పన జరగడం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించే కార్యక్రమం చేయడం లేదు. ఐటి ఉద్యోగాలు ఎండమావిలా తయారయ్యాయి. ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఉద్యోగాల తొలగింపులపై కంపెనీలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోంది. స్వదేశంలోనూ, విదేశంలోనూ వరుసగా ఉద్యోగాలు తొలగిస్తూ పోతున్నారు. ఉద్యోగాలను ఆఫర్ చేసి..తీరా ట్రైనింగ్ పూర్తయ్యాక సగం జీతాలే ఇస్తామంటున్న కంపెనీల నిజాయితీ ఏమిటో తెలుస్తుంది. పెరుగుతున్న ధరలతో మార్కెట్‌లో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి ..జీతాలు కొంచెం తగ్గించి లేదా బోనస్‌లు లాంటివి ఇవ్వకుండా వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఉంటే ఆయా కంపెనీల నిజాయితీ నిలిచేది. కానీ ఉద్యోగాలు తొలగిస్తే ఆ కుటుంబాలు ఏమయిపోతాయన్న కనీస ఆలోచన లేకుండా...సామాజిక బాధ్యతను కంపెనీలు విస్మరిస్తు న్నాయి. ఉద్యోగులను తొలగిస్తూ ఐటి సంస్థలు వరుసగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తు న్నాయి. ఈ చర్య సమాజంలో తీవ్ర అశాంతికి కారణమవుతుందన్న బాధను పట్టించుకోవడం లేదు. ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా వీటిని పట్టించుకోవడం లేదు. ఇకపోతే ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులేనన్న విషయం మరింత కలవరాన్ని కలిగిస్తోంది. ఇంత జరుగుతున్న మనదేశంలో పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదు. అధికారంలో ఉంటూ దోపిడీలకు పాల్పడుతున్నారు తప్ప అభివృద్ధి గురించి, ప్రజల గురించి ఆలోచించడం లేదు. వారిని ఎలా ఆదుకోవాలో అన్న ఆలోచన చేయడం లేదు. ఉద్యోగాలు పోయిన వారికి వారు అండగా నిలుస్తారన్న ఆశా లేదు. ఓ సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 965 కంపెనీలు 1.50లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. 2023లో కూడా ఈ తొలగింపు పక్రియ కొనసాగింది. ఇప్పటికీ తొలగిస్తూనే ఉన్నారు. ఒక్కో నెలలో రోజుకు సగటున 3 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా! అనేక చిన్నాచితక కంపెనీలతో పాటు అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటి సంస్థలు కూడా ఉద్యోగులను సాగనంపే పక్రియలో పోటీ పడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది కాలంలో భారతదేశంలో ఉద్యోగాలు పోగొట్టు కున్న టెకీల సంఖ్య 25 వేల దాకా ఉంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలు తొలగించిన వారిలో 40 శాతం మంది భారతీయులే అని వివిధ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. రానున్న రోజుల్లో కోల్పోయే ఉద్యోగాల్లోనూ భారతీయులే అధికంగా ఉంటారని కూడా ఆ సంస్థలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న భారతీయ యువత పరిస్థితి గందరగోళంగా మారింది. దీనికితోడు హెచ్1బి వీసాల నిబంధనలు వారి పరిస్థితిని మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. దీంతో వేలాదిమంది భారతీయ యువతీయువకులు దేశం కానీ దేశంలో ఉద్యోగాల వేటలో మునిగిపోయారు. ఇప్పుడిది సమాజంలో అశాంతికి కారణం కానుంది. గుడ్డిలో మెల్లలాగా వీటిలో కొన్ని సంస్థలు ముందస్తు నోటీస్‌తో పాటు, కొంత మేరకు పరిహారం ఇస్తున్నాయి. మరి కొన్ని సంస్థలు అటువంటివేమి లేకుండానే లే ఆఫ్ కాగితాన్ని చేతుల్లో పెడుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇళ్ల దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని అత్యవసర సమావేశం పేరుతో ఆఫీసుకు పిలిపిస్తున్న పలు కంపెనీలు తొలగింపు లేఖలను చేతుల్లో పెడుతున్నాయి. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. ఇలాంటి వారికోసం ఏం చేయాలో మన ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, వీరికి భృతి కల్పించడంపై చర్యలు తీసుకోవాలి. ఇది కేంద్రం బాధ్యత మాత్రమే కాదు. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఉమ్మడిగా ఆలోచన చేయాలి. ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్లి విదేశాల్లో స్థిరపడుతున్నారని భావిస్తున్న తరుణంలో ఇక్కడి వారికి తీరని మానసిక క్షోభను తెచ్చి పెడుతోంది. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. కనీసం భరోసా ఇవ్వడం లేదు. ఆదుకుంటా మన్న ఉపశమన వాక్కులు కూడా రావడం లేదు. పెద్దసంఖ్యలో భారతీయ యువత విదేశాలలో రోడ్డున పడుతున్నా ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. దేశీయంగా కంపెనీలకు భారీగా రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు ఉద్యోగాల తొలగింపుపై కంపెనీలను నిలదీయాలి. కఠిననిబంధనలు విధించాలి. ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదే అని స్పష్టంగా తెలియచేయాలి. ఇష్టం వచ్చినట్లుగా తొలగిస్తే వారికి అండగా ఉన్నామన్న విషయం గుర్తు చేయాలి. ప్రభుత్వాలే ఈ బాధ్యత తీసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దక్కదు.

# జిఎస్టీతో కుదేలవుతున్న జనం

- భారం తగ్గించడంలో కేంద్రం విఫలం
- ప్రాంతీయ పార్టీలకు పొగపెడుతున్న మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 : ఐదురాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఫలితాలు బిజెపికి అనుకూలంగా ఉన్న వేళ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఢోకా లేదన్న ధీమాలో బిజెపి ఉంది. అందుకే సామాన్యుల బాధలు పట్టడం లేదు. సమస్యలు చర్చించడం లేదు. ప్రధానంగా పెట్రోల్ ధరలు పెరగడం... జిఎస్టీ స్లాబులు పెరగడం లాంటివి భారంగా మారిన చర్చించడం లేదు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీసి రాజకీయంగా లబ్ధిపొందాలన్న దురాలోచనలో కేంద్రం ఉన్నట్లు కనపడుతోందని విపక్ష కాంగ్రెస్ విమర్శిస్తోంది. బయటకు కనిపించకున్నా ఆర్థికంగా అనేక రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నాయి. తము అనుకున్న రీతిలో రాష్ట్రాలను ఊబిలోకి దించి విద్యుత్, ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలన్న ప్రణాళిక వేస్తున్నారు. మోడీ దృష్టిలో ఎంత మేరకు ఆదాయం రాబట్టామనే లెక్కలు



వేసుకుంటున్నారు. జిఎస్టీ ఆదాయాన్ని విజయంగా చూస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు కనిపించడం లేదు. అయితే దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశ పెట్టాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వాల కాలం నుంచే మొదలయ్యింది. యూపిఎ హయాంలో జిఎస్టీ తీసుకుని రావాలన్న నిర్ణయాన్ని ఆనాడు ప్రస్తుత బిజెపి పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోడీ కూడా గుజరాత్ సిఎం హోదాలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, ప్రజలపై భారం పడుతుందని వాదించారు. కానీ తాను ప్రధాని అయ్యాక దీనిని బలవంతంగా ప్రజలపై రుద్దారు. ఇప్పుడు జిఎస్టీతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనుభవంలోకి వచ్చింది. ఒకేరకమైన పన్ను విధానంతో రకరకాల పన్నులు పోయి ఒకటే విధానం ఉంటుందని,సులభంగా కూడా ఉంటుందని ఆనాడు మోడీ వాదించారు. మోడీ వచ్చాక జిఎస్టీని పట్టుబట్టి అమలు చేయడంతో కేంద్రం పక్కా వ్యాపార ధోరణితో ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. వివిధ దేశాలలో ఒకే రకమయిన పన్ను విధానం ఉండడం ప్రపంచీకరణకు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తుందన్న భావనతో, పన్ను సంస్కరణలు మొదలయ్యాయి. కానీ అమెరికా వంటి దేశంలో కూడా జిఎస్టికి చుక్కెదు రయింది. అక్కడ వారికి ఒకే విధానం కంటె, రాష్ట్రాల ప్రతిపత్తే ముఖ్యం అన్న విధాంలో ఉన్నారు. దీర్ఘకాలం జిఎస్టిపై జరిగిన చర్చలలో రాష్ట్రాల హక్కులకు హాని కలుగకుండా సంస్కరణను ఎట్లా సాధ్యం చేయాలన్న అంశంపై వాదోపవాదాలు జరిగాయి. కొత్త విధానంలోకి మారిన వెంటనే కలిగే నష్టానికి పరిహారం చెల్లిస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. జిఎస్టి విధానం అమలు మొదలైన తరువాత, కరోనా ఇబ్బందుల కాలంలోనూ పన్ను వాటా ఆదాయం గణనీయంగా తగ్గిపోయిన సందర్భంలో పరిహారం ఇవ్వడానికి కేంద్రం ఎన్నో మెలికలు పెట్టింది. చివరకు కొంత ఇచ్చింది కానీ, ఇవ్వవలసినంత మాత్రం ఇవ్వలేదు. రాష్ట్రాలను ఇబ్బంది పెట్టడానికి ఆర్థిక కేటాయింపులను వాడడంలో ప్రస్తుత కేందప్రభుత్వం రాజకీయ వ్యూహం చూపుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతిపక్ష రాష్ట్రాల విషయంలో నిధుల కేటాయింపులు, అనుమతుల విషయంలో పక్షపాతం చూపడం, దానికి ప్రతిస్పందనగానే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం, తీవ్రజాతీయత సహాయంతో ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికి, రాష్ట్రాలను పరాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నదని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే పరీక్ష, చివరకు ఒకే ఎన్నికల దాకా పరిస్థితి వెడుతున్నది. జిఎస్టి పరిహారం సందర్భంలో, తాము కోరుతున్న సంస్కరణలను అమలు చేయడాన్ని ఒక షరతుగా పెట్టడం చూశాం. మొత్తం ఆదాయం కేంద్రం నుంచి మాత్రమే రావలసి వస్తే, ఇక రాష్ట్రాలకు సొంత విధానాలు అంటూ ఏమీ మిగలవు. తాజాగా అలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా అక్కడ పాగా వేయాల న్నది మోడీ నేతృత్వంలోని బిజెపి ప్లాన్‌గా ఉంది. ప్రజల్లో ప్రాంతీయ పార్టీలను చులకన చేసి లేదా మరో రకంగా అధికారం కబ్జా చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్, లెఫ్ట్ నేతలు ఆరోపిస్తున్నారు. జిఎస్టీ సవరణలు కోరినా పట్టించుకోవడం లేదు. అలాగే ఇటీవల చేనేతపైనా భారీగా జిఎస్టీ పెంచాలని చూశారు. అయితే రాష్ట్రాలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. జిఎస్టీ వల్ల కలుగుతున్న ఇబ్బందులను తర్కించి, చర్చించాలని ఆయా పార్టీలు కోరినా లాభం లేకుండా పోతోంది.


# తెలుగు సినిమా అవార్డుల పేరులో స్వాభిమానం

## చరిత్రను గుర్తుచేసేవే అవార్డులు



సిహెచ్. వి. ప్రభాకర్‌రావు,
సీనియర్ జర్నలిస్ట్.

తెలుగు సినిమా చరిత్రకు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్త కీర్తిని సాధించి పెట్టిన మహానుభావులు ఎందరో ఉన్నారు. ఎంతోమంది మహానటుల, దర్శకుల, కవుల, రచయితల మేధోసంపత్తిని రంగరించి, నిర్మించిన తెలుగుసిని చరిత్రలో గుర్తుంచుకొదగ్గ ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు. మూకీ యుగం నుండి నేటివరకు వందలాది మంది నిరంతర కృషి, అకుంఠిత ధీక్ష వల్లనే నేటి తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి ఎదిగింది. సినిమా అనేది ప్రధానంగా వినోదాత్మకమైన కళే అయినా, సమాజంలో ఉన్న అంశాలనే ఎంచుకొని, ఎంతో కొంత అభ్యుదయ భావాలను ప్రేరేపించెట్లుగా తీసిన సినిమాలు ప్రజల ఆదరణ పొందడమే కాకుండా, ఆనాటి మూడనమ్మకాలను, దౌర్జన్యాలను ఎట్టి చూపి, మార్పుకు దోహదపడినవి ఉన్నాయి. మొదట్లో సినిమా అంటే పౌరాణిక కతలనే ప్రధానంగా ఎంచు కొన్నా, తరువాతి కాలంలో సమాజాన్ని మార్చాలని, దేశభక్తిని ప్రేరేపించాలనే లక్ష్యంగా తీసిన సినిమాలు, మహానుభావులు ఉన్నారు. అందులో కొందరినైనా, ముఖ్యంగా, నేటి ప్రము ఖులను గుర్తిస్తూనే, సమా జానికి మార్గదర్శకులుగా ఉండేవారిని, సమాజాభివృ ద్ధిని కాంక్షించే కతా చిత్రాలను, నటులమని కాకుండా, పాత్రోచితంగా నటించి, ప్రజల, ప్రేక్షకుల మన్నలను పొందిన వారిన గౌరవించుకోవడం కూడా సమాజం బాధ్యత. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని దశాబ్దాలుగా, భారత దేశ సినీ ప్రపంచంలోని ప్రతిభావంతులను గుర్తించి, అందులో కొందరికైనా అవార్డుల పేర సముచిత గౌరవాన్ని, గుర్తింపును ఇస్తుంది. అలాగే మన ఉమ్మడి రాష్ట్రంలో కూడా "నంది" అవార్డుల పేర మొన్నటి వరకు ఉత్తమ చిత్రాలకు, నటులకు, సాంకేతిక నిపుణులకు తగిన గుర్తింపు ఇస్తూ వచ్చారు. భౌగోళికంగా రాష్ట్రం విడిపోయిన తరువాత ఏర్పడ్డ పరతిస్థితుల వల్ల కొద్ది సంవత్సరాలుగా ఈ "నంది" అవార్డులు అనేక విమర్శలకు గురవడం వల్ల, తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న విభేదాల వల్ల లేదా రాజకీయ కారణాల వల్లనైతేనేమి, "నంది" అవార్డులు గత చారిత్రగా మిగిలిపోయాయి. ప్రభుత్వాలు మారినంతనే గతంలోని మంచిని, కాదని, ప్రజలలో ఎంతో ఆదరణ, అభిమానం ఉన్న సినిమా రంగా నిపుణులను, నటులను గుర్తించకపోవడం సినిమా ప్రేక్షకులనే కాదు అందరిని భాదయించే విషయమే. ఇటీవల తెలంగాణలో, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రబభహుత్వం మళ్ళీ సినిమా రంగానికి ఇచ్చే "నంది" అవార్డులను ఇస్తామని ప్రకటించడం ఎంతో ముదావహం. కానీ ఆ అవార్డుల పేరును మార్చి, తెలంగాణ బహుజన వాగ్గేయకారునిగా పేరున్న "గద్దర్" పేరుతో అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించడమే చర్చనీయాంశంగా మారింది. గద్దర్ ను గుర్తించడం, ఆయన పేర అవార్డులు ఇవ్వడాన్ని ఎవరు కూడా వ్యతిరేకించడం లేదు. సామాన్య జనజీవితలలో వెలుగు నింపాలని తన జీవిత కాలం పోరాడిన మహానుభావుడు, ప్రజాకళాకారునిగా తెలుగు సాహిత్యానికి గద్దర్ చేసిన సేవలు, ఆయన రాసిన, పాడిన పాటలు తెలుగు భాష చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకొన్నాయి. ఆయన పాత, మాట లేని ప్రజా పోరాటాలను, ఉద్యమాలను ఊహించలేము. తెలంగాణతో న కాకుండా దేశంలోని అనేక ప్రజా ఉద్యమాలతో మమేకం అయిన గద్దర్, ప్రజల కొరకు, బడుగు వర్గాల ప్రజల కొరకు, సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగు నింపడానికి తన జీవితాన్నే అంకితం చేసిన గొప్ప ప్రజాఉద్యమకారుడు. ఆయన సేవలను గుర్తించడం తెలంగాణ ప్రజల, ప్రయాభుత్వ కర్తవ్యం కూడా. తెలుగు సినిమా రంగంతో ముడిపడిన ఎంతోమంది తెలంగాణ కళాకారులు దేశవ్యాప్త గుర్తింపు పొందినా, స్థానికంగా తగిన గుర్తింపు లేకుండా ఉండి పోయారు. తెలుగు సినిమా కొరకు 1930–31 లలో మొదటిసారిగా పాత రాసిన మహాపండితుడు, హరికథకుడు, నాట్యకాకర్త, రచయిత చందాల కేశవదాసు, 1960 లోనే డాదా సాహిబ్ పాల్కే అవార్డు గ్రహీత పైడి జయ్ రాజ్ లాంటి వారు కూడా ఉన్నారు. జయ్ రాజ్ సిని నిర్మాతగా, దర్శకునిగా, హిందీ సినిమా కథానాయకుడుగా, దర్శకునిగా, క్యారెక్టర్ యాక్టర్ గా విభిన్న అంశాలలో ఎంతో గౌరవం పొందాడు. దాదాపు 300 ల చిత్రాలలో నటించి, నాలుగు చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రతిభాశాలి. ఇలాంటి వారి పేరుతో ఉత్తమ సినిమా అవార్డులు ఎస్తే ఇంకా ఎంతో బాగుంటుందనేది విమర్శకుల భావన, ఏ రంగంలోనైనా, ఆ రంగంతో సంబంధం ఉన్న ప్రతిభావంతుల పేర అవార్డులు ఇవ్వడం రివాజు. అలా అని గద్దర్ కు సినిమా రంగంతో సంబందం లేదా అంటే, ఉంది. ప్రముఖ నిర్మాత, దర్శకుడు బి. నర్సింగరావు ని1979 లో నిర్మించిన, గౌతం ఘోష దర్శకత్వం వహించిన "మా భూమి"లో, 1983 లో నరసింగరావు దర్శకత్వం వహించి,నిర్మించిన "రంగులా కల" అనే చిత్రాలలో నటించి, పాటలు పాడాడు. ఆ తరువాత కూడా, అప్పుడప్పుడు సినిమాలలో ఆయన పాటలు, నటన కనిపించింది.




ఇటీవల, తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో నిర్మించిన "జై భోలో తెలంగాణ" కూడా ఆయన పాట, నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకోంది. మొన్నటి వరకు గద్దర్ ను వ్యతిరేకిం చిన వర్గాలే ఈ రోజు ఆయనను నెత్తిన పెట్టుకోవాలని చూస్తున్నాయి. తుపాకి వదిలి, వోట్లతోనే ప్రజల జీవితాలు మారుతా యని నమ్మి, ఆయన తన పయణాన్ని ప్రారం భించడం ప్రజాస్వామ్యం యొక్క గొప్పతనంగా చెప్పుకోవాలి. మార్గం ఏదైనా, ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని పోరాడిన యోదు ని గౌరవించడం సమాజలో భాగమైన ప్రభుత్వాల కర్తవ్యం. కానీ ఆయనకు సముచిత గౌరవం ఇయ్యడంలో ఎంచుకొన్న మార్గాలే ప్రశ్నార్థకం అవుతాయని గ్రహిం చాలి. "గద్దర్" గౌరవించుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ఆయన పేర జానపద, బహుజన సాహిత్యంలో, కళలలో కృషి చేసిన ప్రతిభావంతులను గుర్తించి, వారికి ఆయన పేర నెలకొల్పే అవార్డు ఇవ్వవచ్చు. అలాగే, ఆయన పేర విశ్వ విద్యాలయాలలో కళా పీఠాలు నెలకొల్పవచ్చు. ఆయన కన్నా ముం దున్న వారిని గౌరవించాలనడం ఆయన శక్తిని, గౌరవాన్ని తగ్గించడం ఎంతమాత్రం కాదని గ్రహించాలి.

# సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

- వ్యవసాయరంగంలో తిరుగులేని ఆధిక్యం
- విమర్శలతో నిజాలు కప్పిపుచ్చలేరు: వేముల



నిజామాబాద్,ఫిబ్రవరి23 : బిఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయం బాగుపడిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దానిని కొనసాగించే విషయంలో ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఉన్న జలాశయాలను వాడుకుని నీటిని పొలాలకు మళ్లించాలన్న దృష్టి పెట్టడం లేదన్నారు. కేవలం చిన్నిచిన్న పొరపాట్లను చూపి, గత పాలనను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. నిజానికి మల్లన్న సాగర్ సాకారంతో కాళేశ్వరం కల పూర్తిగా సాకారం అయ్యిందన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని నాటి సీఎం కేసీఆర్ కృషి చేసారని, అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ నేతలు అదేపనిగా విమర్శలు మాని,మల్లన్న సాగర్‌ను, కొండపోచమ్మ సాగర్‌ను చూస్తే నీటి రాక ఎలా ఉందో తెలుస్తుందన్నారు. ప్రాజెక్టులకు నిధులతో సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కాగితం పులులు, సోషల్‌మీడియాలో దుష్ప్రచారంతో పబ్బం గడుపుతున్న అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచించే ప్రభుత్వమని రుజువైందని తెలిపారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి,కాంగ్రెస్ నేతలు తమ పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో ధరలు పెంచడం తప్ప బిజెపి చేసిందేమీ లేదన్నారు. కెసిఆర్ హయాంలో పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి హహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. పదివేల పంట పెట్టుబడి ఇచ్చామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో

నిలిపామని అన్నారు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఏమీ చేయలేదన్న రీతిలో బురదజల్లే కార్యక్రమం చేపట్టడం తగదని అన్నారు. ఇది ప్రజలు కూడా జీర్ణించుకోలేరని అన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వం దని మాజీమంత్రి అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలిగామని అన్నారు. చిన్న మండలాలు, జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయని అన్నారు.

# విభజన హామీలు గాలికొదిలిన జగన్

- మోడీ ప్రాపకం కోసం నేతల తాపత్రయం
- ఒత్తిడి పెంచడంలో కానరాని చిత్తశుద్ధి

అమరావతి,ఫిబ్రవరి23 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు పరచడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సానుభూతి ప్రకటిస్తున్నారా లేక..కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారా అన్నది అర్థం కావడం లేదు. అయితే గత పదేళ్లుగా మోడీ మాత్రం ఇంచు మాత్రం సాయం కూడా చేయకుండా కాలం గడపడంలో విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరు గురించి, కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గురించి మోదీ తరచూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆ తప్పును సరిచేసేందుకు గత పదేళ్ళలోనూ దేశ ప్రధానిగా, సభానాయకుడిగా తాను ఎందుకు ప్రయత్నం చేయలేదో మోదీ ఎప్పుడూ చెప్పలేదు. ఈ క్రమంలో ఏపిలో బిజెపిని ఆదరించాలని కోరుకుంటున్నారు. కొన్ని సీట్లను సాధిస్తే రాజకీయాలు తమ గుప్పిట్లో ఉంటాన్న ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్‌డిఎలోకి టిడిపి చేరితే కొంత పరిస్థితి మెరుగు పడగలదన్న ఆలోచనలో స్థానిక నేతలు కూడా ఉన్నారు. టిడిపి, జనసేనలతో కలసి వెళితే ఓ ఐదారు అసెంబ్లీ సీట్లు కొట్టేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ద్వేషించాలంటే, విభజన సమస్యలను పరిష్కరించకుండా సజీవంగా ఉంచడం ముఖ్యమని, తద్వారానే తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చునని బీజేపీ భావిస్తుందన్న భావన కూడా వ్యాప్తిలో ఉంది.

అందుకే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితికి ఊతమిస్తుందనుకొన్న పోలవరం, ప్రత్యేక హోదా అమలు విషయంలో ప్రత్యేక ప్యాకేజి నాటకానికి తెరతీసింది. విభజనపై జరిగిన అన్యాయాలపై సుప్రీంలో పిటిషన్ వేసి కొట్లాడాలని, పార్లమెంటులో చర్చ చేయాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ పదేపదే కోరుతున్నా ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఉండవల్లి మాటలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. కనీసం ఆయనతో చర్చించడానికి కూడా ఎవరు ముందుకు రావడం లేదు. ఎపి ఆర్థికస్థితి దివాళా తీయడానికి జగన్ పాలాన తీరు కూడా కొంత కారణంగా చూడాలి. డబ్బుల పందేరంతో ఖజానాను దెబ్బతీసారు. అనవసర పథకాలతో డబ్బును ఊడ్చేశారు. మరోవైపు సాయం చేయాల్సిన బిజెపి నేతలు ఆర్థిక దివాళా గురించి పదేపదే ఎద్దేవా చేస్తున్నారు. అమరావతి లక్ష్యం వెనక్కి పోయింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు రావణకాష్ఠంలా మండుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో తన రాజకీయ ప్రయోజనాలను బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఇకపోతే

అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు.

prajamantalau daily pages (24-02-24)_times of varha main (13-2).qxd 2/24/2024 12:12 AM Page 4



# ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించరాదు

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సెప్టెంబర్ నుండి డిసెంబర్ మాసాల వరకుకు సంబంధించిన త్రైమాసిక సమీక్ష లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రుణ సదుపాయం తక్షణమే అందించాలని ఆదేశించారు. జిల్లా లోని బ్యాంకు రుణ లక్ష్యాలు డిసెంబర్ 31 నాటికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ శుక్రవారం సంబంధిత బ్యాంకు అధికారులు, సంబంధిత ఏజెన్సీ సంస్థలతో డిసిసి మరియు డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పట్ల బ్యాంకర్లు అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. జిల్లాలో సెప్టెంబర్ నుండి డిసెంబర్ మాసాల త్రైమాసికంలో వ్యవసాయ రుణాలకు సంబంధించి 1400 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాలు 578 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులకు సంబంధించి రెండవ విడతలో 5683 మందికి రుణాలు మంజూరు చేసామని తెలిపారు.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రుణాల కింద 330 కోట్లు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 192 మందికి మంజూరు చేశామని తెలిపారు. పిఎంఎఫ్ఎంఈ కింద ఇప్పటికే 252 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆశించినంత పురోగతి సాధించని బ్యాంకులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ అన్ని రకాల పథకాలు అమలయ్యేలా చూడాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న స్వశక్తి సంఘాలకు 586 కోట్లు, పట్టణ ప్రాంత సంఘాలకు 54.57 కోట్లు అందించామని తెలిపారు. సమావేశాలకు హాజరయ్యే సమయాలలో బ్యాంకర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సరైన తాజా వివరాలు లేకుండా బ్యాంకు అధికారులైనా, ప్రభుత్వ శాఖల అధికారులైనా సమీక్ష సమావేశానికి రావొద్దని మందలించారు. జిల్లాలో ప్రైవేటు బ్యాంకులు కొన్ని స్కీం లలో ఆశించిన స్థాయిలో ప్రగతి లేదని అదనపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ పొన్న వెంకటరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజినల్ డిప్యూటీ హెడ్ ఆర్బీఐ ఎల్.డి.ఓ. సాయితేజ రెడ్డి, నాబార్డ్ డిడిఎం మనోహర్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ రాం ప్రసాద్, డిఆర్డీఓ సంపత్ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు సాయిబాబా, ఎఫ్ఎల్ సీ. కోట మధు సూదన్ తో పాటు వివిధ బ్యాంకుల ఉన్నత అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెనుస్ట్రల్ హైజీన్‌పై అవగాహన

## బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

సికింద్రాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

లయన్స్ క్లబ్ హైదరాబాద్ యువ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ సౌరబ్ సురేశ్ శుక్రవారం హైదరాబాద్ లోని యూసుఫ్ గూడ్ లోని ఎస్.జీ.బీ హైస్కూల్ లో రుతుచక్ర పేరుతో బాలికలకు శానిటరీ ప్యాడ్స్, మెనుస్ట్రల్ హైజీన్ పై అవగాహన కల్పించారు. డిప్లొమెటిక్ మెషిన్ అధికారి, లయన్స్ క్లబ్ మెంబర్ విజయేత తిర్కే కటారియా ఈసందర్భంగా విద్యార్థినులకు రుతుచక్రం పై పూర్తిగా అవెర్నెస్ కల్పించి, వారి సందేహాలకు సమాదానాలు చెప్పారు. 8 నుంచి 10 వ తరగతి కి చెందిన 90 మంది బాలికలకు మెనుస్ట్రల్ హైజీన్ పై అవెర్నెస్ కల్పిస్తూ, అపరిశుభ్రతతో కలుగు ఇన్ ఫెక్షన్ల గురించి, ముందస్తు జాగ్రత్తలను వివరించారు. అలాగే లయన్స్ క్లబ్ తరపున విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ లను అందచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ యువ సభ్యులు, స్కూల్ ఉపాద్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. లయన్ డాక్టర్ సౌరబ్ సురేశ్ రుతుచక్ర ప్రాజెక్ట్ పేరున సిటీలో ఇప్పటివరకు చాలా స్కూల్ లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిర్వాహకులను పలువురు అభినందించారు.




# ఎమ్మెల్యే నందిత మృతి

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘన నివాళులు

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజా మంటలు)



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత (మాజీ ఎమ్మెల్యే సాయన్న కూతురు) శుక్రవారం ఉదయం ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదంలో మరణించగా జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలవేసి ఘననివాళులర్పించిన జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ,జగిత్యాల జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్, మండల పార్టీ అధ్యక్షులు బాలముకుందాం,పట్టణ ఉపాధ్యక్షులు ఓల్లెం మల్లేశం, దూమాల రాజకుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, నక్కల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జువ్వాడి కృష్ణారావు పరామర్శ

కోరుట్ల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు)



ఇటీవల కోరుట్ల పట్టణానికి చెందిన ఈర్నాల శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మెట్ పల్లి దగ్గర ఉన్న వరద కాలువలో పడి చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు. వీరి వెంట పాల్గొన్న తిరుమల గంగాధర్, కొంతం రాజం, చిట్యాల లక్ష్మీనారాయణ, అందే మారుతీ, తదితరులు

# లలితమాత ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పూజలు

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



జగిత్యాల రూరల్ మండలం పొలాస లోని 108 శ్రీ చక్ర లలితా మాత ఆలయంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాలేపు అజయ్ శర్మ జీవన్ రెడ్డి గోత్ర నామాధులతో అర్చన చేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని ఆలయ ఫౌండరీ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సన్మానించారు. అలాగే పొలాస లోని వేయి లింగాల ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, కటారి చంద్ర శేఖర్ రావు, బండ శంకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ ఆలయ 48 వార్షికోత్సవం వేడుకలు

## శ్రీ గాయత్రి అమ్మవారికి పంచామృత అభిషేకాలు

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయ 48వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా సాగుతుంది. ఈ సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆలయంలోని శ్రీ గాయత్రి అమ్మవారికి పంచామృత అభిషేకాలు పూజా క్రతువులను ఆలయ అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్ శర్మ, వేద పండితులు తిగుళ్ల విషు శర్మ, రుద్రాంగి గోపాల్ కృష్ణ, నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పలు పుష్పాలతో చక్కగా అలంకరించి మంగళహారతులు సమర్పించారు. అలాగే గణపతి హవనము నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపేటలో హనుమాన్ ఆలయ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

పట్టణములోని 12 వ వార్డు ఉప్పరి పేటలో పద్మనాయక వెల్మ సంక్షేమ సంఘం ఉప్పరపేట వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ స్థలాన్ని పరిశీలించి, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్ రావు, ఆనంద్ రావు, రాజేశ్వర్ రావు, సంఘం అధ్యక్షులు భగవంత రావు,ప్రదాన కార్యదర్శి సుధాకర్ రావు, ప్రవీణ్ రావు, సాగర్ రావు, నాయకులు, సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనంలో 'రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డికి మద్దతు పలుకనున్నట్లు' జగిత్యాల ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మంచాల కృష్ణ స్వగృహంలో రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో శాసనమండలి సభ్యులు జీవన్ రెడ్డి పాల్గొని మద్దతు కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు ఎరవెల్లి సురేష్ , ప్రధాన కార్యదర్శి పబ్బ శ్రీనివాస్, జగిత్యాల వర్తక సంఘం అధ్యక్షులు కమాటల శ్రీనివాస్, రిటైర్డ్ ఎండోమెంట్ అధికారి ఊటూరి ప్రభాకర్ తో పాటు పలువురు ఆర్యవైశ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నూతన డి.ఎస్.పీ.ని మర్యాద పూర్వకంగా కలిసిన యస్.టీ యూనియన్ నేతలు

మెట్ పల్లి ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



మెట్ పల్లి కి హైద్రాబాద్ నుండి బదిలీ పై నూతనంగా వచ్చిన డి.ఎస్.పీ. ఉమ మహేశ్వరరావు కి మర్యాద పూర్వకంగా యస్.టీ. యూనియన్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. తర్వాత శాలువాతో చిరు సన్మానం చేయడం జరిగింది.బదిలీ పై వచ్చిన సదర్భంగా మాట్లాడుతు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని డి.ఎస్.పి. తెలిపారు. ఉస్కెల చిన్నయ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం సహకారంతో సిసి రోడ్లు పనులు ప్రారంభం

వేలేరు ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



వేలేరు మండల కేంద్రంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ఎం.పి. (రాజ్యసభ) సభ్యులు బి.ఆర్.ఎస్. పార్టీ సెక్రెటరీ జనరల్ డాక్టర్ కే. కేశవరావు (కే.కే) ఎం.పి. నిధుల నుండి రూ. 9.98 (తొమ్మిది లక్షల 98 వేల రూపాయలు) నిధులు మంజూరు చేయించిన మాజీ కూడా డైరెక్టర్ బిల్లా యాదగిరి. అందులో భాగంగావేలేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 5 లక్షల విలువ చేసే సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన జడ్పిటిసి చాడ సరిత రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వం ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉంటామని అన్నారు ఈ కార్యక్రమంలో భూపతి రాజు, ప్రసాద్, భాస్కర్, అశోకు శంకర్, సంపత్, ప్రభాకర్, రవి, కిరణ్ పాల్, సురేందర్, శ్రీనివాస్, రవి, రాజేష్ రాజు, చిరంజీవి, ప్రవీణ్, పెరుమయ్య, మల్లయ్య ప్రకాష్ సారయ్య, దయాకర్, చంద్ర మౌళి , రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ ఢీ కొని రాకేష్ మృతి

కోరుట్ల ఫిబ్రవరి 22 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని తక్కళ్లపెల్లి సమీపంలో అతివేగంతో వస్తున్న ఇసుక ట్రాక్టర్ వెనుక భాగం తగిలి మెట్ పల్లి పట్టణానికి చెందిన కొమురవేల్లి రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెట్ పల్లి పట్టణానికి చెందిన కొమురవేల్లి రాకేష్ మనోహర్ జ్యూవెల్లర్ లో పనిచేస్తున్నాడు. కోరుట్లలో ఓ వివాహానికి హాజరై తిరిగి మెట్ పల్లి వస్తుండగా కోరుట్ల మండలంలోని తక్కళ్లపెల్లిలో అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ వెనుక భాగం రాకేష్ ను ఢీకొట్టడంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

# జగిత్యాల సీఐ సస్పెన్షన్



జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

జిల్లాలో అవినీతికి పాల్పడిన సీఐపై పోలీస్ ఉన్నతాధికారులు వేటు వేశారు. అవినీతి, క్రైం బర్కింగ్ ఆరోపణల నేపథ్యంలో జగిత్యాల టౌన్ ఇన్ స్పెక్టర్ నటేశ్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ చేశారు. దీని ఆధారంగా సీఐ నటేశ్ ను సస్పెండ్ చేస్తూ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రకటనలో తెలిపారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు

మెట్ పల్లి ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



కోరుట్ల నియోజకవర్గంమెట్ పల్లి మండలంలోని కోనరావుపేట రాజేశ్వర్ రావు పేట గ్రామల్లో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించుచున్న సిసి రోడ్డు పనులను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాఢీ కృష్ణారావు స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించారు గ్రామ అభివృద్ధికి నియోజకవర్గ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర మంత్రులతో మాట్లాడి సంబంధిత శాఖల ద్వారా మరిన్ని నిధులు నియోజకవర్గానికి మంజూరీ చేయించనున్నట్లు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు నాయకులు నిధులు మంజూరు కు కృషి చేసిన కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు కృష్ణారావు లకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి, లక్ష్మణ్, రాహుల్, జగన్, జీవన్, సాయిరెడ్డి, రవి, భూమేష్, గంగరెడ్డి, పరందాం, స్వామి తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం బాధాకరం

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**గాంధీ మార్చురీ వద్దకు మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు**

సికింద్రాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):





ఎంతో చక్కటి భవిష్యత్ కలిగిన కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే మృతి వార్త తెలుసుకున్న మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు. ఆమె డెడ్ బాడీకి పోస్టు మార్టం నిర్వహించగా గాంధీ ఆసుపత్రికి చేరుకొన్నారు. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది నెలల్లోనే మరణించడం దురదృష్టకర మన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా అక్కడి ప్రజలకు నందిత ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదికే కూతురు లాస్య మరణించడం చాలా బాధాకరమైన విషయమని, లాస్య అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి ఒక్కరిని అప్యాయంగా మాట్లాడించే వారన్నారు. ఆమె ఆత్మశాంతి కోసం దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు. లాస్య అంత్య క్రియలు అధికార లాంఛనాలతో నిర్వహిస్తామన్నారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వరసగా మూడు సార్లు ప్రమాదాలు జరగడం, మూడో సారి మాత్రం ఏకంగా ప్రాణాలు కోల్పోవడం చూస్తే దేవుడు పగబట్టినట్లుగా ఉందన్నారు. దైవ దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యే చనిపోయారని, ఇటీవల ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మన్ కుమార్ కూడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం ట్రీట్మెంట్ పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు సీటు బెల్టు పెట్టుకోవాలని, లాస్య సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వలనే ప్రమాదంలో తీవ్ర గాయాలై చనిపోయినట్లు పోలీసు అధికారులు చెప్పారని మంత్రి తెలిపారు. మంత్రి వెంట మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**మార్చురీ వద్దకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు:**

మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి లు శుక్రవారం ఉదయం గాంధీ ఆసుపత్రి మార్చురీకి చేరుకొని, దివంగత ఎమ్మెల్యే లాస్య డెడ్ బాడిని సందర్శించారు. పోస్టు మార్టం అయ్యేంత వరకు అక్కడే ఉండి, ఆ తర్వాత డెడ్ బాడీతో కారా?న లోని ఆమె నివాసానికి వెళ్ళారు. లాస్య నందిత తల్లి, సోదరిలను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, హరీష్‌రావులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఓదార్చి, తమ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

**తలకు తీవ్ర గాయం, విరిగిన ఎడమకాలు..**

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత తలకు తీవ్ర గాయాలు అయ్యాయని, అలాగే ఎడమకాలుతో పాటు దంతాలు విరిగినట్లు పోస్టు మార్టం నిర్వహించిన గాంధీ ఆసుపత్రి వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. దవడ ఎముకతో పాటు ఛాతీ ఎముకలు కూడ విరిగినట్లు డాక్టర్లు గుర్తించారు.

# గాంధీలో చేయాల్సిన రిపేర్లు చాలా ఉన్నాయి

**మరమ్మతులపై దృష్టి పెడతాం.. సీఎం తో చర్చిస్తాం**

**గాంధీలో లీకింగ్ లను చూసిన మంత్రి కోమటిరెడ్డి**

సికింద్రాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

రాష్ట్రంలోనే ప్రముఖ ఆసుపత్రిగా పేరుగాంచిన గాంధీ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత డెడ్ బాడికి పోస్టు మార్టం నిర్వహించిన సందర్భంగా గాంధీ ఆసుపత్రిని మంత్రి సందర్శించారు. మార్చురీ వద్దకు వచ్చిన మంత్రి అక్కడ బిల్డింగ్ నుంచి పలు చోట్ల వాటర్ లీకింగ్ లను చూసి విస్మయం చెందారు. అనంతరం గాంధీ ఆసుప్రతి కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...గాంధీలో సూపరింటెండెంట్ ఛాంబర్ , కాన్ఫరెన్స్ హాల్ తప్ప మిగితా చాలా చోట్ల లీకింగ్ లు, అపరిశుభ్రమైన పరిస్థితి ఉందని, వీటిని చక్కదిద్దడానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈవిషయమై మంత్రి సూపరింటెండెంట్ రాజారావును అడగ్గా, రూ 14.54 కోట్ల అంచనా వ్యయంతో లీకింగ్ లు, డ్రైనేజీ తదితర పనులకు గత ఏడాది నుంచి ఆరుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదని పేర్కొన్నారు. టెండర్ పట్ల కాంట్రాక్టర్లు ఎందుకు ఆసక్తి చూపడం లేదో సంబందిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుంటానని మంత్రి తెలిపారు. టీఎస్ఎమ్ఎస్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసిన మంత్రి వెంటనే గాంధీకి వచ్చి , చేయాల్సిన మరమ్మతు పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గాంధీ ఆసుపత్రి కనీస మౌళిక వసతులు కల్పించి, పేషంట్లు, సహాయకులు, డాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామినిచ్చారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి, త్వరలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఉస్మానియా ఆసుపత్రి భవనం పరిస్థితి బాగా లేదని, దానికి కొత్త బిల్డింగ్ నిర్మించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. సమావేశంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు, అధికారులు ఉన్నారు. మద్యాహ్నం గాంధీ ఆసుపత్రికి చేరుకున్న టీఎస్ ఎమ్ఎస్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావుతో బేటి అయి, గాంధీ లోని సమస్యలపై చర్చించారు. చేయాల్సిన డ్రైనేజీ లీకింగ్లు, తదితర పనులను అడిగి తెలుసుకున్నారు.



# ప్రభుత్వ నిర్లక్ష్యంతో సీఎంఆర్ఎఫ్ బాధితుల ఎదురు చూపు

**ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు**

**తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వి. అర్జున్**

హుజురాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



ప్రాణపాయంలో ఉండి ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు, ముఖ్యమంత్రి సహాయ నిధి అందక ఎదురు చూస్తున్నారని, వారికి సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన ప్రభుత్వానికి సీఎంఆర్ఎఫ్ బాధితుల గోడు గోస తగులుతుందని తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్వి అర్జున్ పేర్కొన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గత రెండు నెలలుగా సిఎంఆర్ఎఫ్ విధి విధానాలు ఖరారు కాకపోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం బాధితులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎందరో అభాగ్యులు వైద్య సహాయం కోసం మెరుగైన చికిత్స కోసం నిరీక్షిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వారిని వెంటనే సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎందరో పేద మధ్యతరగతి ప్రజలకి తక్షణ వైద్య సహాయం కింద నిధులు మంజూరు చేయగా కార్పొరేట్ హాస్పిటల్లో సైతం మెరుగైన వైద్యాన్ని అందించి లక్షలాదిమందికి ప్రాణదానం చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజలు నేటికీ గుండెల్లో గుడి కట్టారన్నారు. ప్రజా అవసరాలు పాటించకపోగా, సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి లో విధానాలు ఖరారు చేయకపోగా, సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి ల కొరకై వైద్యానికి అయ్యే ఎస్టిమేట్లను సైతం పంపొద్దని ఆసుపత్రులకు అంతర్గత ఆదేశాలు ఇవ్వడం సిగ్గు చేటు. రేవంత్ ప్రభుత్వం నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. అనేకసార్లు రేవంత్ రెడ్డి క్యాబినెట్ మీటింగ్ లు పెట్టి ప్రజలకు అవసరమైన సీఎంఆర్ఎఫ్ పై ఏ ఒక్కనాడు చర్చించకపోవడం విధి విధానాలను ఖరారు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి ప్రజలపై వారికున్న అభిష్టానికి నిదర్శనం అని అన్నారు. ప్రజా పాలన పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలని వేధింపులకు గురి చేస్తున్నారే తప్ప ఆరు గ్యారంటీల సంగతి దేవుడు ఎరుగు ప్రజలకు కనీస హక్కు అయిన ఉచిత విద్య వైద్యం అందించడంలో ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేరుకే ఆరోగ్యశ్రీ అని, రూ 10 లక్షల పథకం పేరుతో కాగితాలకే పరిమితం చేశారని ప్రతి వైద్యానికి నిమ్స్ ఆసుపత్రికి పంపడంతో వారి మీద అధిక భారం పడుతుందని అన్నారు. వైద్య సహాయం సకాలంలో అందగా ఎందరో ప్రాణాలు కోల్పోతూ కుటుంబాలను అనాధలను చేస్తున్నారని అర్జున్ పేర్కొన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అండగా నిలిచే సీఎంఆర్ఎఫ్ పై సానుకూలంగా స్పందించి సకాలంలో బాధితులను ఆదుకోవాలని, లేనట్లయితే ఈ విధంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రేవంత్ ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని అర్జున్ హెచ్చరించారు. ఆయన వెంట టియుఎఫ్ నేతలు భూపతి రాకేష్, టి. కమలాకర్, ఎం. సాయి విశాల్ తదితరులున్నారు.



ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని ధర్మపురిలోని ఆయన నివాసంలో పరామర్శించిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని ధర్మపురిలోని ఆయన నివాసములో పరామర్శించిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, ముస్లిం సెంట్రల్ కమిటీ మాజీ అధ్యక్షులు ఖాజీమ్ అలీ, జగిత్యాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కమటాల శ్రీనివాస్ తదితరులు

# ఇబ్రహీంపట్నం మండలానికి 19.45 లక్షల ఎంపీ అరవింద్ నిధులు మంజూరు

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



ఇబ్రహీంపట్నం మండలానికి 19.45 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేసిన ఎంపీ అరవింద్ ధర్మపురి చేశారని ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు బాయ్ లింగారెడ్డి తెలిపారు. అమ్మక్కపేట హనుమాన్ దేవాలయం దగ్గర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 4 లక్షలు. ఇబ్రహీంపట్నం గంగపుత్ర వాడకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 4 లక్షలు. ఎర్దండి గంగ పుత్ర వాడకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 3 లక్షలు. వర్షకొండ పద్మశాలి సంఘం కు 3.50 లక్షలు. వర్షకొండ వ్యవసాయ మార్కెట్ లో సిసి డ్రైనేజ్ నిర్మాణానికి 4.95 లక్షలు. మంజూరు చేసిన ఎంపీ అరవింద్ కి ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు భాయ్ లింగారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మౌలిక సదుపాయాల లక్ష్యంగా 2024-25 బడ్జెట్ చైర్మన్ గోలి శ్రీనివాస్

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):




మౌళిక సదుపాయాల కల్పన, స్వచ్ఛ హరిత జగిత్యాల లక్ష్యముగా మరియు పట్టణభివృద్ధి ద్యేయముగా 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ను రూపొందించినట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గోలి శ్రీనివాస్ తెలిపారు. ఇట్టి సమావేశము యందు పురపాలక సంఘం జగిత్యాల బడ్జెట్ 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను రూ.లు 62.40 కోట్ల బడ్జెట్ ను కౌన్సిల్ ఆమోదించడం జరిగినది. పట్టణమును హరిత జగిత్యాల లక్ష్యముగా గ్రీన్ బడ్జెట్ కు బడ్జెట్ యందు 10% నిధులు రూ.లు 2.76 కోట్లు కేటాయించడం జరిగినది. పట్టణ ప్రజారోగ్యరిత్య పారిశుధ్య నిర్వహణకు రూ.లు 3.23 కోట్లు కేటాయించడం జరిగినది. ప్రజల మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యముగా అభివృద్ధి పనుల నిమిత్తం, వీలిన గ్రామాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల, మైనరిటిల మరియు మురికి వాడల ప్రాముఖ్యం కలిగిన వార్డుల అభివృద్ధి, పార్కులు, ఆటస్థలాలు, పబ్లిక్ టాయిలెట్స్, ఓపెన్ జిమ్ లు, స్ట్రీట్ వేండర్ జోన్స్ ఆధునిక జంతు వదశాలల నిర్మాణం, శాస్త్రీయమైన పద్దతిలోడంపింగ్ యార్డులు మరియ ఘణ-ద్రవ వ్యర్ధాల నిర్వాహణ మరియు మొదలగు వాటికి రూపాయలు 3.98 కోట్లు మరియ అంచనా బడ్జెట్ మిగులు లో 1/3%తీ౦% కేటాయించి వెనుకబడిన తరగతులు, మైనారిటీలు మరియు మురికి వాడల ప్రాముఖ్యం కలిగిన నివాసిత ప్రాంతం అభివృద్ధి దశలో నున్న ప్రాంతం మరియు కొత్తగా విలీనమైన ప్రాంతం లోని పనులు మరియు సంక్లిష్టమైన మౌళిక సదుపాయాలు అవసరాలపై మిగిలిన బడ్జెట్ లో 1/3 భాగము నిధులు రూ.1.99 కోట్ల నిధులు కేటాయించడం జరిగినది. ఇట్టి సమావేశములో చైర్ పర్సన్ గోలి శ్రీనివాస్, గౌరవ కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ పి. అనిల్ బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ , టి.పి.ఎస్. తేజస్విని, జే.ఏ.ఓ. గణేష్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం

మెట్ పల్లి ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



బిజెపి పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం జరిగింది కుల సంఘాల భవనాల కోసం ఎంపీ నిధుల నుండి కోరుట్ల నియోజకవర్గానికి సుమారుగా 70. లక్షల రూపాయలు మంజూరు చేసిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ కోరుట్ల బిజెపి నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ ఎంపీ అరవింద్ మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో నాలుగు మండలాలు మెట్ పల్లి కోరుట్ల పట్టణాలతో కలిపి కుల సంఘాల సంక్షేమం కోసం ఎంపీ ధర్మపురి అరవింద్ తన నిధుల నుండి 70 లక్షలు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నామని కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని దేశంలో సబ్కా సాత్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్ కేవలం బిజెపితోనే సాధ్యమని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలు ఔర్ ఏక్ బార్ దేశ ప్రధాని నరేంద్ర మోడీని గెలిపించుకోబోతున్నారని చెప్పారు. ఈ యొక్క సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనీకేల నవీన్. మండలాల అధ్యక్షులు బింగి వెంకటేష్, బాయ్ లింగారెడ్డి, గోపిడి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రుద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సన్మానించిన జగిత్యాల టీఎన్జీవోలు

జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



టిజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ బదిలీపై అబ్కారి శాఖ జగిత్యాల జిల్లా పర్యవేక్షకులుగా నియమితులై నేడు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిఎన్జీఓ జగిత్యాల జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏ. సత్యనారాయణను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మాట్లాడుతూ.... గెజిటెడ్ అధికారులు మరియు నాన్ గెజిటెడ్ అధికారులు కలిసిమెలిసి సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకొద్దామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, టీజీవో జగిత్యాల జిల్లా కార్యదర్శి మామిడి రమేష్, కలెక్టరేట్ ఏఓ హనుమంతరావు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీధర్, వెటర్నరీ ఏడి డాక్టర్ నరేష్, గణేష్, డా.రాజేందర్ రెడ్డి, మధుకర్, మహేష్, కిరణ్, అసద్, నగేష్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న ఎస్సై అనిల్

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):




ఇబ్రహీంపట్నం కు చెందిన వాల్గోటు నరేష్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం ఓబులాపూర్ శివారులో గల గోదావరి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా తన యొక్క ట్రాక్టర్ నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా యామాపూర్ గ్రామ శివారులో పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగింది అని ఎస్ఐ ఏ అనిల్ తెలిపారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మాజీ మంత్రి శశిధర్ రెడ్డి సంతాపం

సికింద్రాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పట్ల మాజీ మంత్రి, బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం నందిత ఇంటికి వెళ్ళి ఆమె పార్థివదేహాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు. ఈసందర్భంగా లాస్య నందిత తల్లి, సోదరికి సానుభూతి తెలిపి, ధైర్యంగా ఉండాలన్నారు. మర్రి శశిధర్ రెడ్డితో పాటు నాయకులు ప్రవీణ్ గౌడ్, వికాస్ లు ఉన్నారు.

## తెలంగాణ ఏఈఓ డైరీ ఆవిష్కరించిన జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్

ఎల్కతుర్తి ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



తెలంగాణ ఏఈఓ డైరీ-2024 ని హన్మకొండ జిల్లా డైరీ ని గౌరవ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ రవీందర్ సింగ్ ఆవిష్కరించారు దీనిలో భాగంగా ఏ ఈ ఓ లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ కి వివరించడం జరిగింది, దీనికి జిల్లా వ్యవసాయ అధికారి సానుకూలంగా స్పందించి ఏ ఈ ఓ ల సమస్యలను త్వరలోనే తీరుస్తామని వివరించారు ఈ కార్యక్రమంలో ఏడిఏ కే. దామోదర్ రెడ్డి , స్టేట్ యూనియన్ ట్రెజరర్ పంజాల రాజు, స్టేట్ బాడీ మెంబర్స్ కళ్యాణి, సుమలత హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ టి. తిరుపతి, జనరల్ సెక్రెటరీ ఎండి. అహ్మద్ రజా, ట్రెజరర్, ఎం. సరిత హనుమకొండ జిల్లా ఏఈవోలు పాల్గొన్నారు.

## మా సినిమాకు పిల్లా బచ్చాలు రావద్దు

### ఎ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న తంత్ర



ఏ దర్శకనిర్మాత అయినా.. తమ సినిమా అందరూ చూడాలని కోరుకుంటారు. కానీ.. ఈ దర్శకనిర్మాతలు ముందే వార్నింగ్ ఇస్తున్నారు. కారణం.. ఈ సినిమాకు వచ్చిన సెన్సార్ సర్టిఫికేట్ అలాంటిది మరి. తమ సినిమాకి ఎ సర్టిఫికేట్ రావడంపై 'తంత్ర' టీమ్ వెరైటీగా రియాక్ట్ అయ్యింది. మా సినిమాకి పిల్ల బచ్చాలు రావద్దని హెచ్చరిస్తూ 'ఎ ని పెద్దగా హైలైట్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసింది. నిజానికి ఇదొక సరికొత్త క్రియేటివ్ ప్రమోషనల్ స్ట్రాటజీ అని చెప్పుకోవాలి. అలానే తమ సినిమా మంచి హర్రర్ ఎలిమెంట్స్‌తో థ్రిల్ చేస్తుందని కాన్ఫిడెంట్‌గా ఉన్న మేకర్స్.. చిన్నపిల్లలు రావద్దని వారిస్తూ.. వార్నింగ్ ఇస్తున్నారు. ఈ ప్రమోషనల్ స్ట్రాటజీ నిజంగానే మంచి స్పందనను రాబట్టుకుంటోంది. ఈ వార్నింగ్.. అంతా ఈ సినిమా గురించి మాట్లాడుకునేలా చేస్తుంది. ఇప్పటికే రిలీజైన చిత్ర టీజర్, సాంగ్స్ మంచి స్పందన రాబట్టుకోగా.. తాజాగా మేకర్స్ వదిలిన వార్నింగ్ పోస్టర్ మరింతగా.. ఈ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. హీరోయిన్ అనన్య నాగళ్ల పల్లెటూరి అమ్మాయిగా, క్షుద్రపూజలకి గురైన బాధితురాలిగా టీజర్‌లో కనపడితే.. 'ధీరే ధీరే' సాంగ్‌లో అందమైన ప్రియురాలిగా కుర్రాళ్ల మనసుల్ని కొల్లగొడుతోంది. అనన్య నాగళ్లకి జోడీగా శ్రీహరి ఫ్యామిలీ నుంచి వచ్చిన ధనుష్ రఘుముద్రి ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణకానున్నాడు. వీరే కాకుండా 'మర్యాదరామన్న' ఫేం సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్ ఈ హార్డ్‌హిట్టింగ్ హర్రర్ డ్రామాకి తమదైన గాఢతని తీసుకొచ్చారని దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెలుపుతున్నారు. మారుమూల శ్రీకాకుళం జిల్లాలోని ఒక గ్రామం నుంచి వచ్చిన ఈ దర్శకుడు వాల్ట్‌డిస్నీలో పనిచేసే స్థాయికి ఎదిగి, సినిమా తీయాలన్న తన లక్ష్యాన్ని 'తంత్ర'తో సాధించారు. ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్ బ్యానర్స్ సంయుక్తంగా రూపొందించిన ఈ సినిమా ట్రైలర్‌ని త్వరలోనే విడుదల చేస్తామని నిర్మాతలు నరేష్ బాబు, రవి చైతన్య తెలిపారు.

# క్రమశిక్షణ తోనే బంగారు భవిష్యత్తు

### ఘనంగా శ్రీసాయి విజ్ఞాన్ భారతి కాలేజీ వార్షికోత్సవం

### ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

సికింద్రాబాద్ ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):




క్రమశిక్షణతో కూడిన విద్యతోనే చక్కటి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని, ముందుకు సాగాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా తమకు నచ్చిన ఇతర అంశాలపై కూడ నైపుణ్యం సాధించాలని కోరారు. పద్మారావునగర్ కు చెందిన శ్రీసాయి విజ్ఞాన భారతి మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీ 32 వ వార్షికోత్సవ వేడుకలు సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... విద్యార్థులు ఓ వైపు చదువుతునే మరో వైపు తమకు నచ్చిన రంగాల్లో రాణిస్తే, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. తల్లి దండ్రులు పిల్లల ఇష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. ప్రతి మనిషి జీవితంలో చదువు ప్రాముఖ్యత ఎంతో గొప్పదని, అలాంటి విద్యను అందిస్తున్న గురువులకు మనమంతా జీవితమంతా రుణపడి ఉంటామన్నారు. ఈసందర్భంగా శ్రీసాయి విజ్ఞాన భారతి యాన్వెల్ మ్యాథమెటిక్స్ కాంపిటీటివ్ ఎగ్జామ్-2024 విజేతలకు బహుమతులను అందచేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, ప్రముఖ గైనకాలజిస్ట్ డా. కే.సుమ ప్రసాద్, కాలేజీ కరస్పాండెంట్ సాయిబాబా, చైర్మన్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రమాదేవి, నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

# వనదేవతలు, సమ్మక్క సారాలమ్మలను దర్శించుకున్న బోయినపల్లి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండలం దామెర గ్రామం లో సమ్మక్క సారాలమ్మ వనదేవతల దర్శనం చేసుకున్న మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ కి దామెర గ్రామ శాఖ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సాతూరి చంద్రమౌళి నాయకులు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు మరియు హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మను తెలంగాణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు ఆ ఆడబిడ్డల దీవెనలు ప్రజలపై ఉండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని సమ్మక్క సారలమ్మలను వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సమ్మక్క సారలమ్మ కమిటీ చైర్మన్ రామ్ సింగ్, స్థానిక సర్పంచ్ రవీందర్ రెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరి స్వామి, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బూరుగుల రామారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ ఎంపీపీ తంగెడ శాలిని మహేందర్, రాష్ట్ర నాయకులు గొల్లే మహేందర్, లోకిని సూరయ్య, బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్, సాతూరి వెంకన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, మండల యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షులు గుండేటి సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సాతూరి శంకర్, సీనియర్ నాయకులు పిట్టల మహేందర్, గుండా ప్రతాప్ రెడ్డి, మదన్ మోహన్ రావు, కమ్రుద్దీన్, చల్ల సమ్మిరెడ్డి, సమ్మయ్య, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, బాబురావు యాదవ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆచరణ సాధ్యం కాని అంచనా ఆదాయాలు, వ్యయాలు

### 36వ వార్డ్ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ





జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):

జగిత్యాల మున్సిపల్ బడ్జెట్, ప్రతి సంవత్సరం కొంచం పెంచాలన్ని ఉద్దేశ్యంతో పెంచి చూపారు తప్ప లోతుగా పరిశీలిస్తే, ఆచరణ సాధ్యం కాని అంచనాలతో ప్రజలను మభ్యపెట్టి, పబ్బం గడుపుకొనెట్లుగా ఈ బడ్జెట్ ఉందని 36వార్డ్ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ విమర్శించారు. 2024-25 బడ్జెట్ మొత్తం అంచనా ఆదాయం 62 కోట్ల 40 లక్షల ఒకవేలు కాగా, అంచనావ్యయం 57 కోట్ల 18 లక్షల 44వేల గా చూపారని, ఇందులో 2024-25 సాధారణ నిదుల ద్వారా అంచనా ఆదాయం రూ 27 66.08 లక్షలు. ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా ఆదాయం- రూ 2604.06 లక్షలు. 2024-25 సాదారణ నిదులతో, అంచనావ్యయం 2766.0 లక్షలు. 2024-25 ప్లాన్ నాన్ ప్లాన్ గ్రాంట్లు ద్వారాఅంచనావ్యయం -2952.36 లక్షలు, అంచనా మిగులు రూ. 398.59 లక్షలు. పన్నుల ద్వారా ఆదాయం 14 కోట్ల 19 లక్షల 73 వేలుగా చూపారని, ఇది సాధించలేని ఆమె అన్నారు. కానీ గత సంవత్సరం మొత్తం పన్నుల ద్వారా ఆదాయం కేవలం 7 కోట్ల 68 లక్షల 52 వేలు మాత్రమే. దీనికి పెంచిన 10 కోట్లకు మించిరానందున, ఈసారి 4కోట్లు అదనపు ఆదాయంగా ఎలా చూపారని ప్రశ్నించారు. నల్ల బిల్లుల ద్వారా వచ్చే ఆదాయం కేవలం 50.00 లక్షలు మాత్రమే కాని, 350.00 లక్షలుగా చూపారు అంటే అదనంగా 3 కోట్లు వేసారు. మొత్తం కలిపి 7 కోట్ల రూపాయలను అంచనా ఆదాయం 2766.08 లక్షల లోనుండి తీసివేస్తే కేవలం. 2066.08 లక్షలు మాత్రమే. గ్రాంట్ల ద్వారా ఆదాయం :- ఇందులో కేవలం 15వ ఫైనాన్స్ గ్రాంటు ఒక్కటే వస్తుంది అది అంచనా 413.70 లక్షలు. పట్టణ ప్రగతి గ్రాంట్ - 450. 36 లక్షలు, అర్బన్ ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్ 1500.00 లక్షలు. ఇవి రెండు కూడా కొత్త ప్రభుత్వం మంజూరు చేయటం లేదు. అంటే ఇవి తీసి వెస్తే గ్రాంట్ల ద్వారా ఆదాయం కేవలం రూ. 653.70 లక్షలు మాత్రమే. సాధారణ నిదుల ఆదాయం 2066.08 లక్షలు గ్రాంట్ల ద్వారా ఆదాయం 653.70 లక్షలు. మొత్తం ఆదాయం 2719.78 లక్షలు ఇక్కడ పట్టణ ప్రజల మాలిక సదుపాయాల ఖర్చు చాల తక్కువ మరియు వార్డుల వారి అభివృద్ధికి కూడు కెటాయింపులు తగ్గించారు. దీని వల్ల పట్టాణభివృద్ధి కష్టమే. లోతుగా పరిశీలిస్తే గ్రాంట్లు వచ్చే పరిస్థితి లేని వల్ల అంచనాలు కూడ తక్కువయి గత బడ్జెట్ అంచనా ఆదాయం కన్న తక్కువ అవుతున్న దృష్ట్యా ఇది మైనస్ బడ్జెట్గా చెప్పుకోవచ్చని జయశ్రీ విమర్శించారు..







జగీత్యాల జిల్లా పొలాస లో సమ్మక్క సారలమ్మ లను దర్శించుకొన్న భక్త జనం.. సకల సౌకర్యాలు, ఏర్పాట్లు చేసిన ఫౌండర్ పడాల రవీంధర్

## మంచి పాత్రలు వస్తే మళ్లీ నటిస్తా

### మన్మథుడు హీరోయిన్ అన్షు



తాగితే కదా నచ్చుతుందో లేదో తెలిసేది'... ఈ డైలాగ్ వినగానే 'మన్మథుడు' చిత్రం ఎలాగైతే గుర్తొస్తుందో అమాయకంగా ఆ డైలాగ్ చెప్పిన అన్షు కూడా అంతే గుర్తొస్తుంది. మన్మథుడు చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమైన ఈ బ్యూటీ ప్రభాస్‌తో 'రాఘవేంద్ర' చిత్రంలో నటించింది. తమిళంలో రెండు చిత్రాల్లో గెస్ట్ అపీయరెన్స్ లో కనిపించి మెప్పించింది. హీరోయిన్ గా నటించించి రెండు చిత్రాల్లోనే అయినా యువత మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆ తర్వాత ఆమె ఏ సినిమాలోనూ కనిపించలేదు. సచిన్ సగ్గర్ ను పెళ్లి చేసుకుని స్థిరపడింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆమె మీడియా ముందుకొచ్చింది. తాజాగా ఓ తెలుగు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సడెన్ గా సినిమాలు ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో కారణాలను చెప్పింది. 'ఇంగ్లండ్‌లో పుట్టి పెరిగినప్పటికీ.. మా పూర్వీకులు భారతీయులే. 16 ఏళ్ల వయసులో ఇండియా వచ్చాను. అప్పుడే మన్మథుడు సినిమాలో ఆఫర్ వచ్చింది, దీంతో నా కల నిజమైనట్టు అనిపించింది. అయితే సినిమాల్లో యాక్టివ్ కావాలనుకున్నా. కానీ చిన్న వయసు కావడంతో చదువుపై కూడా దృష్టి పెట్టాలనుకున్నా. కానీ మంచి అవకాశాలు రావడంతో సినిమాల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడంటే పీఆర్ టీమ్‌లు వున్నాయి. కానీ అప్పుడు నాన్నే నా వెంట ఉండేవారు. ఎక్కడికి వెళ్లాలన్నా నాన్న పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చేది. కథలు చెప్పడానికి ఎవరైనా వచ్చినా వాళ్లు ముందుగా నాన్ననే కలవాల్సి వచ్చేది. నేను తెలుగులో నటించిన రెండు సినిమాల్లోనూ సెకెండ్ హీరోయిన్ గానే చేశా. రెంటింటిలోనూ నా పాత్ర చనిపోతుంది. ఈ సినిమాలు చూసి మరో రెండు మూడు చిత్రాల్లో అలాంటి రోల్స్‌నే ఆఫర్ చేశారు. ఆ తరహా పాత్రలు చేయడం కన్నా ఖాళీగా ఉంటే బెటర్ అనిపించి సినిమాల్ని వదిలేశా' అని అన్నారు. ప్రస్తుతం తనకు నచ్చే క్యారెక్టర్ ఆఫర్ చేస్తే మళ్లీ సినిమాల్లో నటిస్తా అని ఆమె తెలిపారు.

## మళ్లీ వేగం పుంజుకున్న గేమ్ ఛేంజర్ షూటింగ్




మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా కోలీవుడ్ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా జరుపుకుంటుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి రామ్‌చరణ్, నవీన్‌చంద్రపై ఓ యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ షెడ్యూల్ మార్చి 2 వరకు జరగనుంది. ఓ సాధారణ యువకుడు అసాధారణ నాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరిస్తూ చక్కటి సామాజిక సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. అరవింద్ స్వామి, ఎస్‌జే సూర్య, సురేష్ గోపి, ఈషా గుప్తా, అంజలి, శ్రీకాంత్, జయరామ్, సునీల్, హ్యారీ జోష్ మరియు నవీన్ చంద్ర ఈ సినిమాలో కీలక పాత్రలలో కనిపించనున్నారు.

## ముగిసిన తొలిరోజు ఆట..

### సెంచరీతో చెలరేగిన జో రూట్.. 3 వికెట్లతో మెరిసిన ఆకాశ్ దీప్

రాంచీ టెస్టులో తొలిరోజు ఆట ముగిసింది. దీంతో ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. జో రూట్ తన 31వ టెస్టు సెంచరీని సాధించిన తర్వాత ఆలీ రాబిన్సన్‌తో కలిసి నాటౌట్‌గా నిలిచాడు. జో రూట్ 106 పరుగులు చేశాడు. భారత్ తరపున అరంగేట్రం ఆడుతున్న ఆకాశ్ దీప్ 3 వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ 2 వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ చెరో వికెట్ తీశారు. ఇంగ్లండ్ టాప్-3 బ్యాట్స్‌మెన్ 57 పరుగులకే పెవిలియన్‌కు చేరుకున్నారు. ఆ తరువాత, జానీ బెయిర్‌స్టో కొద్దిసేపు ఆకట్టుకున్నారు. కానీ రవి అశ్విన్ బంతిని కొనసాగించాడు. ఇంగ్లిష్ బ్యాట్స్‌మెన్‌లు నిర్ణీత వ్యవధిలో పెవిలియన్‌కు చేరుకున్నారు. మరోవైపు జో రూట్ గట్టిగా నిలబడ్డాడు. బెన్ ఫాక్స్‌తో పాటు, జో రూట్ లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌తో ఉపయోగకరమైన భాగస్వామ్యాలు చేసి జట్టు స్కోరును గౌరవప్రదమైన స్కోరుకు తీసుకెళ్లాడు. గ్లండ్‌లో ఓపెనర్ జాక్ క్రౌలీ 42 పరుగులు చేశాడు. అదే సమయంలో బెన్ డకెట్ 11 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఆలీ పోప్ తన ఖాతాను తెరవలేకపోయాడు. జానీ బెయిర్‌స్టో 38 పరుగులు చేశాడు. ఇంగ్లిష్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 3 పరుగుల వద్ద రవీంద్ర జడేజాకు బలయ్యాడు. బెన్ ఫాక్స్ 47 పరుగులతో మంచి ఇన్నింగ్స్ ఆడాడు. టామ్ హార్ట్లీ 13 పరుగులు చేశాడు. భారత బౌలర్ల గురించి మాట్లాడితే, ఆకాష్ దీప్ తన అరంగేట్రం టెస్ట్‌లో అద్భుతమైన బౌలింగ్‌ను ప్రదర్శించాడు. ఆకాశ్ దీప్ ఇంగ్లండ్ టాప్-3 బ్యాట్స్ మెన్స్‌ను తన బలిపశువులను చేసుకున్నాడు. మహ్మద్ సిరాజ్ 2 వికెట్లు అందుకున్నాడు. రవి అశ్విన్, రవీంద్ర జడేజాలు ఒక్కొక్క వికెట్ సాధించారు. కాగా, కుల్దీప్ యాదవ్ వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు.

# తెలుగులో పట్టుకోసం జాన్వీ యత్నం



గత కొన్నేళ్లలో టాలీవుడ్ మార్కెట్ కూడా విపరీతంగా పెరిగింది. దీంతో బాలీవుడ్‌లోని స్టార్ హీరోయిన్లు మాత్రమే కాదు.. యంగ్ హీరోయిన్లు సైతం తెలుగులో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఏదైనా ఆఫర్ వస్తే కాదనుకుండా ఓకే చెప్పేస్తున్నారు. అలాగే జాన్వీ కపూర్ కూడా ఎన్‌టీఆర్ సరసన నటించనున్న 'దేవర'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఈ మూవీ నుండి తన ఫస్ట్ లుక్ కూడా విడుదల చేశారు మేకర్స్. 'దేవర'లో తను హీరోయిన్‌గా నటిస్తుందని అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుండి ప్రతీ ఇంటర్వ్యూలో తనకు ఈ సినిమాకు సంబంధించిన ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఇక తాజాగా పాల్గొన్న ఇంటర్వ్యూలో తెలుగు నేర్చుకోవడంపై జాన్వీ స్పందించింది. దేవర' చిత్రంలో జాన్వీ కపూర్.. తంగమ్ అనే పాత్రలో కనిపించనుంది. పల్లెటూరి పిల్లగా, అచ్చమైన తెలుగమ్మాయిగా జాన్వీ ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను పంచుకుంది ఈ భామ. 'నేనెప్పుడూ తెలుగు నేర్చుకోలేదు. ఆ విషయంలో ఇప్పటికీ సిగ్గుపడుతున్నాను. మామూలుగా వింటుంటే అర్థం చేసుకోగలను. కానీ మాట్లాడలేను. నేను బాధపడే విషయాల్లో అది కూడా ఒకటి. ఇలా నేర్చుకోవాలి అనే ఆలోచన నాలో చాలాకాలంగా లేదు. కానీ దేవర టీమ్ మాత్రం చాలా ఓపికగా నాకు సహాయపడుతున్నారు. వారంతా పెద్ద స్టార్స్‌తో పనిచేస్తున్నా కూడా నా డైలాగుల విషయంలో నాకు సాయం చేయడం కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు' అని 'దేవర' టీమ్ చేస్తున్న సాయం గురించి చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్. ఎన్‌టీఆర్‌తో చేస్తున్న 'దేవర' విడుదల అవ్వకముందే సూర్య, రామ్ చరణ్ లాంటి స్టార్లతో కూడా జాన్వీ నటించనుందని తన తండ్రి బోనీ కపూర్.. ఒక ఇంటర్వ్యూలో ప్రకటించారు. దీంతో ఫ్యాన్స్ అంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కూడా జాన్వీ స్పందించింది. 'మా నాన్న వెళ్లి ఏదో అనౌన్స్‌మెంట్ ఇచ్చేశారు. ఆయన ఏం చెప్పారో కూడా నాకు సరిగ్గా తెలియదు. నాన్న నాతో గానీ, నిర్మాతలతో గానీ ఏమీ మాట్లాడలేదని నేను కచ్చితంగా చెప్పగలను. అప్పుడప్పుడు కేవలం షూటింగ్స్ మాత్రమే చేసుకుంటూ ఏ అనౌన్స్‌మెంట్, క్లారిటీ లాంటివి లేని ప్రపంచంలోకి వెళ్లిపోతే బాగుంటుంది అనిపిస్తుంది' అని బోనీ కపూర్ ఇచ్చిన ప్రకటన గురించి వ్యాఖ్యలు చేసింది. హిందీలో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో దూసుకుపోతున్న సమయంలోనే జాన్వీ కపూర్‌కు టాలీవుడ్ నుండి పిలుపు వచ్చింది. ఎన్‌టీఆర్‌తో చేస్తున్న 'దేవర' విడుదల అయితే తనకు టాలీవుడ్‌లో కూడా గుర్తింపు వస్తుందని ఎదురుచూస్తున్న జాన్వీకి ప్రతీసారి నిరాశే ఎదురవుతోంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ వెళు_ంది. ఇప్పుడు ఏకంగా ఈ మూవీ రిలీజ్ ఆరు నెలలు పోస్ట్‌పోన్ అయ్యింది. దీంతో ఎన్‌టీఆర్ ఫ్యాన్స్‌తో పాటు జాన్వీ ఫ్యాన్స్ కూడా ఫీల్ అవుతున్నారు. ప్రస్తుతం జాన్వీ చేతిలో మూడు హిందీ చిత్రాలు ఉండగా.. అవన్నీ ఈ ఏడాదిలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. వాటితో పాటు 'దేవర' కూడా ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# కథా,కథనంలో బలం లేని సుందరం మాస్టారు చిత్రం

ఏ సినిమా కయినా కథలో బలం ఉండాలి. కథనంలో పట్టు ఉండాలి. అప్పుడు చిన్న సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. ప్రముఖ నటుడు రవితేజ నిర్మాణ సంస్థను ప్రారంభించి కొత్తవాళ్ళకి ప్రోత్సాహం ఇస్తూ, చిన్న సినిమాలను తీస్తున్నారు. ఇప్పుడు 'సుందరం మాస్టర్' అనే సినిమాతో కళ్యాణ్ సంతోష్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేశారు. హాస్య నటుడిగా పలు చిత్రాలలో నటించిన హర్ష చెముడు ఈ సినిమాతో కథానాయకుడిగా పరిచయం అయ్యారు. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు, దివ్య శ్రీపాద కథానాయకురాలు. సుందరం (హర్షవర్ధన్) ఒక ప్రభుత్వ కళాశాలలో సోషల్ టీచర్ గా పనిచేస్తూ ఉంటాడు. అతనికి కట్నం మీద ఆశ ఎక్కువ, అందుకని ఎవరు ఎక్కువ కట్నం ఇస్తారా అని పెళ్లి ప్రయత్నాల్లో ఉంటాడు. ఆ ప్రాంత ఎమ్మెల్యే (హర్షవర్ధన్)కి మిరియాలమెట్ట గ్రామం నుండి తమ వూరికి ఒక ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిని పంపించమని లేఖ వస్తుంది. మిరియాల మెట్ట అనే గ్రామ ప్రజలు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా వుంటారు, ఆ గ్రామంలోకి బయట వాళ్ళకి కూడా ప్రవేశం లేదు. కానీ ఆ గ్రామంలో ఒక విలువైన వస్తువు ఎదో ఉందని, ఆ వస్తువుని కనిపెట్టి ఆ గ్రామాన్ని తన నియోజకవర్గంలో కలిపేయాలని ఎమ్మెల్యే సుందరాన్ని కోరతాడు. దానితో తనకి పేరొస్తుందని, సుందరాన్ని డిఈఓ గా ప్రమోషన్ కూడా ఇస్తానని ఎమ్మెల్యే మాట ఇస్తాడు. ప్రొమోషన్ వస్తే కట్నంగా ఇంకా ఎక్కువ డబ్బు రాబట్టవచ్చు అని సుందరం కూడా ఆ గ్రామానికి వెళ్ళడానికి ఒప్పుకుంటాడు. సుందరం ఇంగ్లీష్ టీచర్ గా మిరియాల మెట్ట గ్రామంలో అడుగుపెడతాడు. కానీ అతనికి ఆశ్చర్యంగొలిపే విషయం ఏంటంటే, అక్కడ ఆ గ్రామస్థులు అందరూ సుందరం మాస్టర్ కన్నా చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతూ వుంటారు. సుందరంకి ఇంగ్లీష్ సరిగ్గా రాదనీ అతనికే ఒక పరీక్ష పెడతారు. ఆ పరీక్షలో ఫెయిలైతే ఉరితీత అని చెప్తారు. మరి ఆ పరీక్షలో సుందరం సఫలం అయ్యాడా, విఫలం అయ్యాడా, ఇంతకీ ఆ వూర్లో వున్నా విలువైన వస్తువు ఏంటి? అది సుందరం కనిపెట్టాడా? అతనికి ప్రమోషన్ వచ్చిందా? ఇంతకీ అతని పెళ్లి సంగతి ఏమైంది? ఇవన్నీ తెలియాలంటే 'సుందరం మాస్టర్' సినిమా చూడాల్సిందే. హర్ష చెముడు కథానాయకుడిగా సినిమా అనగానే వినోదాత్మకంగా ఉంటుందని అనుకొనన్న వారికి తీవ్ర నిరాశ తప్పదు. వినోదాత్మకంగా కానీ, ఇటు ఏదైనా కథాబలం వున్న సినిమాగా కానీ




తెరకెక్కించలేదు. అసలు ఈ సినిమా ద్వారా దర్శకుడు ఏమి చెప్పాలనుకున్నాడో కూడా అది చెప్పలేకపోయాడు. కథ సరిగా లేకుండా కేవలం రెండు గంటలకి పైగా ఎదో అక్కడక్కడా కొన్ని హాస్య సన్నివేశాలు పెట్టి సినిమా నడిపిద్దాం అన్న రీతిలో సినిమా సాగింది. నటీనటుల విషయానికి వస్తే హర్ష చెముడు తన పాత్రకి తగిన న్యాయం చేసాడు. అక్కడక్కడా హాస్యం పండించాడు. దివ్య శ్రీపాద కథానాయకురాలిగా బాగుంది, కానీ ఆమెకి పెద్దగా ప్రాధాన్యం లేని పాత్ర ఇచ్చారు. హర్షవర్ధన్ ఎమ్మెల్యేగా, అతని పీఏ గా భద్రం పరవాలేదనిపించారు. ఇక మిగతా నటీనటులందరూ తమ పాత్రల పరిధి మేరకు చేశారు. ఛాయాగ్రహణం పరవాలేదు, సంగీతం బాగుంది. మాటలు ఆలోచనాపరంగా వున్నాయి, కొంచెం వేదాంత ధోరణిలో కూడా వున్నాయి. రవితేజ లాంటి సీనియర్ నటుడు ఈ సినిమా ఎలా నమ్మి నిర్మాతగా ఒప్పుకున్నారో ఆయనకే తెలియాలి.

# రవిచంద్రన్ సరికొత్త అశ్విన్ రికార్డు!

### టీమిండియా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు.

ఇంగ్లండ్‌పై టెస్టుల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. రాంచీ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టులో యాష్ ఈ ఘనత సాధించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్ రెండో బంతికి స్టార్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టోను అశ్విన్ ఔట్ చేశాడు. దీంతో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో 100 వికెట్ల మార్క్ అందుకున్నాడు. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్టుల్లో 100 వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా రవిచంద్రన్ అశ్విన్ రికార్డుల్లో నిలిచాడు. యాష్ కంటే ముందు జేమ్స్ అండర్సన్ ఈ ఫీట్ అందుకున్నాడు. భారత జట్టుపై టెస్టుల్లో జిమ్మీ 139 వికెట్లు తీశాడు. అండర్సన్ 35 మ్యాచ్‌ల్లో 100 వికెట్స్ తీయగా.. యాష్ 23 మ్యాచ్‌ల్లోనే ఈ మార్క్ అందుకున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లోనే టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అశ్విన్ అందుకున్న విషయం తెలిసిందే. రవిచంద్రన్ అశ్విన్ మరో అరుదైన రికార్డు సాధించాడు. టెస్టు ఫార్మాట్లో ఒకే ప్రత్యర్థిపై 1000 పరుగులు, 100 వికెట్లు తీసిన క్రికెటర్‌గా నిలిచాడు. తరపున ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. అశ్విన్ కంటే ముందు జార్జ్ జిఫెన్ (ఇంగ్లండ్‌పై), మోనీ నోబుల్ (ఇంగ్లండ్‌పై), విల్ఫ్రెడ్ రోడ్స్ (ఆస్ట్రేలియాపై), గ్యారీఫీల్డ్ సోబర్స్ (ఇంగ్లండ్‌పై), ఇయాన్ బోతమ్ (ఆస్ట్రేలియాపై), స్టువర్ట్ బ్రాడ్ (ఆస్ట్రేలియాపై) ఈ ఫీట్ నమోదు చేశారు.




## మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్



క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురుచూసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 షెడ్యూల్‌ను గురువారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) విడుదల చేసింది. దేశంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ 2024కు సంబంధించిన ఫస్టాఫ్ షెడ్యూల్‌ను మాత్రమే బీసీసీఐ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగతా షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించనుంది. మార్చి 22న ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం కానుండగా.. తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెన్నైలో తలపడనున్నాయి. తెలుగు టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న ఆడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సన్‌రైజర్స్ ఆడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్ ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో రెండు మ్యాచ్‌లు మాత్రమే జరగనున్నాయి. మార్చి 27న ముంబై ఇండియన్స్, ఏప్రిల్ 5న చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లను సొంత మైదానంలో సన్‌రైజర్స్ ఆడనుంది. ఇక ఐపీఎల్ 2024 ఫస్టాఫ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మొత్తం 4 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో రెండు హోమ్ గ్రౌండ్‌లో, మరో రెండు ఆవలి గ్రౌండ్‌లో ఆడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది.

### సన్‌రైజర్స్ హైదరాబాద్ షెడ్యూల్:

మార్చి 23 – కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ హైదరాబాద్ – కోల్‌కతా (రాత్రి 7.30 గంటలకు)
మార్చి 27 – సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ ముంబై ఇండియన్స్ – హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)
మార్చి 31 – గుజరాత్ టైటాన్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ – అహ్మదాబాద్ (రాత్రి 7.30 గంటలకు)
ఏప్రిల్ 5 – సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ – హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com